జనరాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 3 సంచిక - 6 పక్షపత్రిక మార్చి 16-31, 2012



## కోవూరు, మహబూబ్‌నగర్ ఉపఎన్నికలలో

# జన రాజకీయానికి జేపీ ప్రచారం






నెల్లూరు  ఉపఎన్నికల ప్రచారంలో లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ్



నెల్లూరులో మహిళా దినోత్సవ వేడుకల్లో జేపీ

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక ఫిబ్రవరి16-31, 2012

సంపుటి - 3 సంచిక - 6

## లోపలి పేజీల్లో...

2012-13 కేంద్ర బడ్జెట్.................... 5
కీలక రంగాలలో విఫలమైన కేంద్రబడ్జెట్........ 6
బడ్జెట్ అంటే...................................... 8
పద్దుల చిట్టాలా రైల్వే బడ్జెట్................ 9
ఐదు రాష్ట్రాల ఎన్నికలు........................ 11
మంత్రులు, ఐఎఎస్‌లకు తాఖీదులు..... 14
కులం ఏదైనా అందరూ ఎదగాలి.......... 16
జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర ................ 18
పంటలు అమ్మకాలపై ఆంక్షలు............... 23
ఆంక్షల్ని తొలగిస్తేనే రైతులకు ఆదాయం.. 27
నిజాం షుగర్స్ ప్రవేటీకరణ ................... 31
లోక్‌సత్తా పార్టీ కార్యక్రమాలు.............. 33

## సంపాదకవర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత అరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# ఉప ఎన్నికల తీరుపై లోతైన చర్చ జరగాలి

## సంపాదకీయం

ప్రజాప్రయోజనాల్ని, రాష్ట్ర భవిష్యత్తుని, రాజ్యాంగాన్ని బలి చేసైనా అధికారంలోకి రావటమే ధ్యేయమనే ప్రమాదకర ధోరణి ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పంథాగా మారిందని తాజాగా జరిగిన ఏడు అసెంబ్లీ స్థానాల ఉప ఎన్నికల తీరు రుజువు చేస్తోంది. ఇంత విచ్చలవిడిగా రాజ్యాంగ ఉల్లంఘన, డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాల పంపిణీ జరిగిన ఎన్నికలలో అభ్యర్థుల గెలుపు ఓటముల మీద కన్నా, వ్యవస్థల పతనం మీద లోతైన చర్చ జరగాల్సి వుంది.

ప్రజల వనరుల్ని లూటీ చేయటానికి రాజకీయ పార్టీలు అధికారాన్ని సాధనంగా ఉపయోగించుకుంటున్నాయి, అందుకోసం దేనికైనా దిగజారటానికి సిద్ధపడటం చూస్తే మహాత్మాగాంధీ, డా॥ బీ.ఆర్.అంబేద్కర్ తమ సమాధులలో నుంచి కూడా విలపిస్తారు. వక్రమార్గాలతో సరైన లక్ష్యాల్ని సాధించలేమని గాంధీ, అంబేద్కర్ విశ్వసిస్తే... ఈవేళ్టి నాయకులు అధికారం సాధించుకునేందుకు ఎంత దిగజారుడు మార్గమైనా తప్పులేదనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

ప్రజాజీవితంలో విలువల పతనానికి, రాజకీయ సంస్కృతి పతనానికి రాష్ట్రాన్ని మూడు దశాబ్దాలుగా పరిపాలిస్తున్న కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలదే బాధ్యత. ఆ రెండు పార్టీల పట్ల ప్రజలలో ఎంత ఆగ్రహం, వ్యతిరేకత పేరుకుపోయాయంటే... మరో సరైన ప్రత్యామ్నాయం గురించి కూడా ఆలోచించకుండా ఆ పార్టీల్ని పాతిపెట్టాలని జనం భావిస్తున్నారు. ఆ పార్టీలకు ప్రత్యామ్నాయంగా మారాలని ప్రయత్నిస్తున్న సాంప్రదాయ పార్టీలు కూడా దురదృష్టవశాత్తూ ఆ రెండుపార్టీల తానులోని గుడ్డగానే ఉన్నాయి.

ప్రజాస్వామ్యం, రాష్ట్రభవిష్యత్తు పట్ల ప్రేమ ఉన్న పౌరులందరికీ ఈ ఉప ఎన్నికల తీరు, నేటి రాజకీయాల తీరు ఒక మేలుకొలుపు కావాలి. ఈ తీవ్ర సంక్షోభంపై లోతైన సమీక్ష చేసుకుని మేలుకోకపోతే ఆంధ్రప్రదేశ్ పతనం చెందటం అనివార్యమవుతుంది. బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు చాలాకాలంగా దిగజారిన రాజకీయాలకు, వెనకబాటుతనానికి, అవినీతికి పరాకాష్ఠగా భావించేవారు. కానీ ఆ రెండు రాష్ట్రాలలో పరిస్థితులు చక్కబడుతుండగా, ఆంధ్రప్రదేశ్ ఆ ఖాళీని భర్తీచేస్తోంది.

చెడు రాజకీయాలను తిడుతూ కూర్చోవటం, రాజకీయాలపట్ల ద్వేషంతో దూరంగా ఉండటం వల్ల పరిస్థితి మెరుగుపడదు. రాజకీయాలలో పతనం పట్ల ఆందోళన చెందుతున్న పౌరులంతా రాజకీయాలలో మేలి మార్పుకు లోక్‌సత్తా పార్టీ వేదికను ఉపయోగించుకోవాలి. కొత్త తరానికి కొత్త రాజకీయం అందించేందుకు చేస్తున్న పోరాటంలో పాలుపంచుకోవాలి. నిజాయతీ, నిబద్ధత, నాయకత్వ లక్షణాలున్న వారందరినీ లోక్‌సత్తా పార్టీ ఆహ్వానిస్తోంది.






# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

**ఫోన్ నంబర్లు :**
**040-23311817, 23311819,**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 040-23310612**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**
సెల్ : *80085 07934*

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# 2012 - 13 కేంద్ర బడ్జెట్

## కొన్ని ముఖ్యాంశాలు

***దాదాపు 15 లక్షల కోట్ల వ్యయం గల 2012-13 బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అరకొర చర్యలు తప్ప కీలకరంగాలలో ఈ బడ్జెట్ విఫలం అయింది. ఈ బడ్జెట్‌లో కొన్ని ముఖ్యాంశాలను అందిస్తున్నాం.***

- 2011-12లో జీడీపీ వృద్ధి రేటు అంచనా 6.9 శాతం మాత్రమే, అంతకు ముందు రేండేళ్లలో ఇది వరుసగా 8.4 శాతం నమోదైంది.
- 2012-13లో వృద్ధిరేటు 7.6 శాతానికి చేరుతుందనే ఆశాభావం!
- ద్రవ్యోల్బణ కట్టడికి పంపిణీ, నిల్వలు, మార్కెటింగ్ వ్యవస్థలోని లోటుపాట్లను చక్కదిద్దే చర్యలు.
- జీడీపీలో రాయితీల భారాన్నీ 2 శాతానికి తగ్గించే ప్రయత్నం, మూడేళ్లలో దీనిని 1.75శాతానికి చేర్చాలనే ఆలోచన.
- మీ వినియోగదారుడి గురించి తెలుసుకో! పేరిట జాతీయ స్థాయివ్యవస్థ.
- 'స్వాభిమాన్ గ్రామాల్లో అల్ట్రాస్మాల్ బ్యాంకు శాఖల ఏర్పాటు, బిజినెస్ కరస్పాండెంట్ల నియామకం.
- 12వ పంచవర్ష ప్రణాళికలో మౌలిక వసతులపై రూ॥50 లక్షల కోట్ల పెట్టుబడి, ఇందులో సగం ప్రైవేటు సెక్టార్ వాటా!
- రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖకు రూ॥25,360 కోట్ల కేటాయింపు.
- చేనేత కార్మికులు, నేత సంఘాలకు రూ॥3844 కోట్ల రుణాలు మాఫీ.
- చిన్న తరహా పరిశ్రమల కోసం 'ఆపర్చునిటీస్ వెంచర్ ఫండ్'కు రూ॥5 వేలకోట్లు.
- రూ॥ 5,75,000 కోట్ల వ్యవసాయరుణాల వితరణ లక్ష్యం.
- రాష్ట్రాల సహకారంతో 'జాతీయ ఆహార ప్రాసెసింగ్ మిషన్' ఏర్పాటు.
- తల్లీ, శిశువులలో పౌష్టికాహార లోపం సమస్య పరిష్కారానికి... 200 జిల్లాల్లో ప్రత్యేక పథకం.
- జాతీయ రహదారుల అభివృద్ధి పథకం (ఎన్‌హెచ్‌డీపీ) పరిధిలోకి 8800 కిలోమీటర్ల రోడ్లు.
- పన్నెండో పంచవర్షప్రణాళికలో 6000 మోడల్ స్కూల్స్ ఏర్పాటు.
- త్వరలో జాతీయ పట్టణ ఆరోగ్య పథకం (ఎన్‌యూహెచ్‌ఎం) ప్రారంభం.
- జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకానికి నిధులు 34 శాతం పెంపు. రూ॥3915 కోట్లకు చేరిన కేటాయింపు.
- గిరిజన ప్రాంతాల్లో జీవనోపాధి కల్పనకు... 'భారత్ జీవనోపాధి సంస్థ' ఏర్పాటు.
- వితంతు పెన్షన్ రూ॥200 నుంచి రూ॥300కు పెంపు.
- 18-64 సంవత్సరాల మధ్య వయసులో కుటుంబ యజమాని మరణిస్తే... అందించే సహాయం రూ॥10వేల నుంచి 20 వేలకు పెంపు.
- కేంద్రసాయుధ బంగాలకు 4000 నివాస గృహాల నిర్మాణం.
- 60 కోట్ల మంది వివరాల నమోదుకు 'ఆధార్'కు రూ॥60 కోట్ల కేటాయింపు.
- గ్రామీణ గృహ నిర్మాణానికి నిధులు రూ॥3 వేల నుంచి 4 వేల కోట్లకు పెంపు.
- సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల ద్వారా వచ్చే వడ్డీ రూ॥10 వేలపై పన్ను మినహాయింపు. ముందస్తు ఆరోగ్య పరీక్షల ఖర్చులో రూ॥5వేల వరకు పన్ను మినహాయింపు.
- చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తప్పనిసరిగా పన్ను ఆడిట్ చేయించుకోవాల్సిన టర్నోవర్ పరిధి రూ॥60 లక్షల నుంచి రూ॥1 కోటికి పెంపు.

# కీలకరంగాలలో విఫలమైన కేంద్రబడ్జెట్: జేపీ

కేంద్రబడ్జెట్ 2012-13 కొన్ని అంశాలలో అభినందనీయంగా ఉన్నా దేశాభివృద్ధికి అత్యంత కీలకమైన వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన రంగాలలో యధాతథ స్థితిని కొనసాగించటంతో విఫలమైంది.

సేవల పన్ను పరిధి విస్తరణ, ఎక్సైజ్ పన్ను పెంపు వంటి చర్యల ద్వారా ద్రవ్యలోటును కట్టడి చేసేందుకు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు కొంత ఊరటనిచ్చేందుకు కేంద్ర ఆర్థికమంత్రి ప్రయత్నించారు. బొగ్గు, ఇంధనం వంటి రంగాలలో ఆలస్యంగానైనా మౌలికవసతులను అభివృద్ధి చేసేందుకు శ్రద్ధ చూపటం స్వాగతించదగ్గ అంశం. అలాగే పన్ను ఎగవేతలను అరికట్టటానికి అనేక చర్యలను ప్రకటించటం, నల్లధనంపై శ్వేతపత్రాన్ని ప్రకటిస్తామని, మనీలాండరింగ్, బినామీ ఆస్తుల సంపాదన వంటి జాడ్యాలను కట్టడి చేసేందుకు చట్టాన్ని ప్రవేశపెడతామని హామీ ఇవ్వటం ఆహ్వానించదగ్గ అంశం. విదేశాలలో భారతీయులు దాచుకున్న లక్షలకోట్ల డబ్బును వెనక్కితీసుకురావటానికి ఈ చర్యలు ఉపయోగపడకపోయినా శరవేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థలో నల్లధనాన్ని అదుపుచేయటానికి మాత్రం దోహదపడతాయి.

అయితే వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన రంగాలలో సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి ఆర్థికమంత్రి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదు. కేవలం గత ఏడాది కంటే కాసిని ఎక్కువ నిధుల్ని కేటాయించి చేతులు దులుపుకున్నారు. వ్యవసాయరంగంలో సంక్షోభాన్ని ఎదుర్కోవటంపై మాటలేతప్ప చేతలు కొరవడ్డాయి. ప్రపంచంలోనే అత్యధికంగా భారతదేశం వంటనూనెల్ని దిగుమతులు చేసుకుంటోంది. ఆ నూనెల ఉత్పత్తితో మనదేశం స్వావలంబన సాధించేదిశగా ప్రోత్సాహకాలిచ్చే అంశం మీద కనీస ప్రస్తావన కూడా లేదు. దేశీయంగా నూనెగింజల ఉత్పత్తిని బలోపేతం చేసేందుకు వీలుగా వంటనూనెల దిగుమతులపై కనీసం 10శాతం కస్టమ్స్‌సుంకం

## బడ్జెట్ సమగ్ర స్వరూపం

(రూ. కోట్లలో)

| | 2010-11 | 2011-12 | 2012-13 (బడ్జెట్ అంచనా) |
|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు(2+3) | 788471 | 766989 | 935685 |
| 2) పన్ను ఆదాయం | 569869 | 642252 | 771071 |
| 3) పన్నేతర ఆదాయం | 218602 | 124737 | 164614 |
| 4. మూలధన వసూళ్లు (5+6+7) | 408857 | 551730 | 555241 |
| 5) రుణాల రికవరీ | 12420 | 14258 | 11650 |
| 6) ఇతర వసూళ్ల | 22846 | 15493 | 30000 |
| 7) అప్పులు, ఇతరత్రా వసూళ్ల | 373591 | 521980 | 513590 |
| 8. మొత్తం వసూళ్లు (1+4) | 1197328 | 1318720 | 1490925 |
| 9. ప్రణాళికేతర వ్యయం (10+11+12) | 818299 | 892116 | 969900 |
| 10. రెవెన్యూ ఖాతా | 726491 | 815740 | 865596 |
| 11. వడ్డీ చెల్లింపులు | 234022 | 275618 | 319759 |
| 12. మూలధన ఖాతా | 91808 | 76376 | 104304 |
| 13. ప్రణాళిక వ్యయం (14+15) | 379029 | 426604 | 521025 |
| 14. రెవెన్యూ ఖాతా | 314232 | 346201 | 420513 |
| 15. మూలధన ఖాతా | 64797 | 80404 | 100512 |
| 16. మొత్తం వ్యయం (9+13) | 1197328 | 1318720 | 1490925 |
| 17. రెవెన్యూ వ్యయం (10+4) | 1040723 | 1161940 | 1286109 |
| 18. మూలధన ఆస్తుల కోసం కేటాయించిన గ్రాంటులు | 87487 | 137505 | 164672 |
| 19. మూలధన వ్యయం (12+15) | 156605 | 156780 | 204816 |
| 20. రెవెన్యూ లోటు (17-1) | 252252 | 394951 | 350424 |
| 21. ద్రవ్యలోటు(16-(1+5+6) | 373591 | 521980 | 513790 |
| 22. ప్రాథమిక లోటు (21-11) | 139569 | 246362 | 193831 |

- మొత్తం రెవెన్యూ వ్యయం నుంచి మొత్తం రెవెన్యూ వసూళ్లు తీసివేస్తే రెవెన్యూ లోటు వస్తుంది.
- మొత్తం వ్యయం నుంచి మొత్తం రెవెన్యూ వసూళ్లు, రుణాల రికవరీ, ఇతర వసూళ్లు తీసివేస్తే ద్రవ్యలోటు వస్తుంది.
- మొత్తం ద్రవ్యలోటు నుంచి వడ్డీ చెల్లింపులు తీసివేస్తే ప్రాథమిక లోటు వస్తుంది.

విధించటం, వ్యవసాయోత్పత్తుల ఎగుమతుల్ని ప్రోత్సహించటం, వ్యవసాయోత్పత్తులకు మార్కెట్ విలువను చేకూర్చటం, రిటైల్ చైన్లు ఏర్పాటు చేయటం గురించి కీలకాంశాల ఊసే లేదు. రైతులకు తక్కువ వడ్డీకి రుణసౌకర్యం ఆహ్వానించదగ్గదే అయినా వ్యవసాయాన్ని, భారతదేశ ఆర్థికవ్యవస్థను పునరుజ్జీవింప చేయటానికి ఆ చర్య సరిపోదు. "రైతులకు మెరుగైన మార్కెట్లు, వారి ఉత్పత్తులకు అదనపు విలువ, పెట్టుబడులను, ఎగుమతులను పెంపొందించేలా ప్రోత్సాహక ధరలు కావాలి. వీటిలో ఏ ఒక్క అంశాన్నీ బడ్జెట్‌లో పేర్కొనలేదు".

"వ్యవసాయరంగం సంక్షోభంలో ఉంది. సరైన విధానాలతో ముందుకెళ్తే వ్యవసాయం మనకు తురుపుముక్క అవుతుంది. వ్యవసాయాభివృద్ధి గ్రామీణ ఆర్థికవ్యవస్థకు నూతనోత్తేజాన్నిచ్చి పేదరికాన్ని తగ్గిస్తుంది. ఉత్పత్తిని పెంచినప్పుడు మాత్రమే మనం వినియోగదారులను కాపాడగలం. అలాగే మంచి రేటు లభించినప్పుడు మాత్రమే ఉత్పత్తిని పెంచగలం. గ్రామీణ భారతాన్ని, వ్యవసాయాన్ని దెబ్బతీస్తే దీర్ఘకాలిక అభివృద్ధి సాధ్యం కాదు".

విద్య, వైద్య రంగాలలో ఆర్థికమంత్రి ఎక్కడా ముందుచూపునూ ప్రదర్శించలేదు. ఆ రంగాలను మెరుగుపరచటానికి ఎలాంటి నూతన కార్యాచరణనూ ప్రకటించలేదు. ప్రస్తుతం ఆరోగ్యానికి జీడీపీలో ఒక్కశాతంగా ఉన్న వాటాని 2.5శాతానికి పెంచుతామని ఒకపక్క ప్రధానమంత్రి చెబుతుంటే... ప్రణబ్ ముఖర్జీ మాత్రం జాతీయ ఆరోగ్యమిషన్‌కు కాస్త నిధుల కేటాయింపును పెంచటంతో సరిపుచ్చారు. ఆరోగ్యసేవల రంగంలో దారుణవైఫల్యాలను పూర్తిగా విస్మరించారు. అదేవిధంగా విద్యారంగంలో పడిపోతున్న ప్రమాణాలను, సర్వశిక్షా, మాధ్యమికశిక్షా అభియాన్‌ల అమలులో వైఫల్యాల్ని ఆర్థికమంత్రి ఏమాత్రం పరిగణలోకి తీసుకోలేదు. విద్యాప్రమాణాల విషయంలో 74 దేశాలలో భారతదేశం 73వ స్థానంలో ఉంది. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన ఆర్థికవ్యవస్థ ప్రపంచస్థాయికి ఎదగాలనే ఆకాంక్షతో ముందు కెళ్తుంటే... మన పాఠశాల విద్య ఫలితాలు నగుబాటు చేసేలా ఉన్నాయన్నారు. విద్యారంగంలో ఫలితాలు ఎలా వున్నాయి, సరైన ప్రమాణాల ఫలితాల్ని ఎలా సాధించాలి, ఎలా జవాబుదారీతనం పెంపొందించాలి అనే అంశాల మీద ఆర్థికమంత్రి దృష్టి పెట్టలేదన్నారు.

జాతీయ నైపుణ్యాల అభివృద్ధి మండలికి నామమాత్రపు నిధుల్ని విదిలించి కోట్లాది భారతీయ నిరుద్యోగ యువత సమస్యకు పరిష్కారం చూపకుండా ఆర్థికమంత్రి తప్పించుకున్నారు. ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందుతున్నా నిరుద్యోగం విస్తరిస్తుండటం ఆందోళనకర అంశం, యువత అవసరాల్ని బడ్జెట్ విస్మరించింది.

ఆర్థికాభివృద్ధిని సుస్థిరంగా ముందుకు తీసుకెళ్లటం, అవినీతిని అంతం చేయటం, పారదర్శకతను పెంపొందించటం, పేదరికాన్ని నిర్మూలించటం, అసమానతల్ని తగ్గించటంపై ఈవేళ భారతదేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ దృష్టి కేంద్రీకరించాలి. ఈ మౌలికాంశాల్ని రాజకీయానికి కేంద్రబిందువు చేయటంలో ఇప్పటిదాకా అన్ని రాజకీయ పార్టీలూ విఫలమయ్యాయి.

"జనాకర్షక పథకాలను, ఓటు బ్యాంకు రాజకీయాలను కొనసాగిస్తూ మనం పేదరికాన్ని అంతం చేయలేం, సమానత్వాన్ని పెంపొందించలేం. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఉపాధి కల్పన రంగాలలో మనం భారీస్థాయిలో ఫలితాల్ని సాధించాలి". ◆

## ధరలు పెరిగేవి

- ద్విచక్రవాహనాలు, కార్లు
- రిఫ్రిజిరేటర్లు, ఏసీలు
- వాషింగ్ మిషన్లు, వాచీలు
- సబ్బులు, కాస్మొటిక్స్
- సిగరెట్లు, బీడీలు
  పొగాకు, పాన్ మసాలా
- బంగారం, ఆభరణాలు
- విమాన ప్రయాణాలు
- హోటల్ భోజనం, అతిథ్యరంగం
- సిమెంట్, మొబైల్ బిల్లులు
- దిగుమతి చేసుకునే సైకిళ్లు,
  ఇతర వాహనాలు
- రైల్లో ఏసీ ప్రయాణం

# బడ్జెట్ అంటే....

**బడ్జెట్ :** స్థూలంగా ఒక ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయ, వ్యయపట్టిక, ప్రజల నుంచి పన్ను రూపేణా వసూలు చేసిన ధనాన్ని వారికోసం ఎలా వినియోగించబోతున్నారో వివరించే కార్యాచరణ ప్రణాళిక.

**ములధన బడ్జెట్ (క్యాపిటల్ బడ్జెట్) :** మూలధన ఆదాయ, వ్యయ పట్టికగా చెప్పుకోవచ్చు. వార్షిక బడ్జెట్‌లో మూలధన బడ్జెట్‌తో పాటు రెవెన్యూ బడ్జెట్ కూడా ఉంటుంది. ప్రభుత్వానికి మూలధన ఖాతాలో వసూలయ్యే ఆదాయం, ఖర్చులు మూలధన బడ్జెట్‌లో ఉంటాయి. ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ వసూళ్లు, ఖర్చులకు సంబంధించిన వివరాలు రెవెన్యూ బడ్జెట్‌లో ఉంటాయి.

**మూలధన వ్యయం (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) :** ఆస్తులు సమకూర్చుకునేందుకు, వాటాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చేసే ఖర్చు ఇది. మరో మాటలో చెప్పాలంటే ఆదాయ వనరులు సృష్టించుకునేందుకు లాభాపేక్షతో ప్రభుత్వం చేసే ఖర్చు ఇది.

**ప్రణాళికా వ్యయం (ప్లాన్ ఎక్స్‌పెండిచర్) :** ప్రభుత్వం ఆదాయ వనరులను, ఆస్తులను సృష్టించుకునేందుకు చేసే వ్యయం ఇది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రణాళికలకు చేసే కేటాయింపులు ఈ ఖాతాలో ఉంటాయి.

**ప్రణాళికేతర వ్యయం (నాన్‌ప్లాన్ ఎక్స్‌పెండిచర్) :** ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులు, రక్షణ పోలీసు వ్యవస్థల నిర్వహణ. ఎన్నికల నిర్వహణ, కళలు, క్రీడలు, కుటుంబ సంక్షేమం, సమాచార ప్రసార, పర్యాటక రంగాలు, విదేశీ వ్యవహారాలు, కార్మిక సంక్షేమం, వ్యవసాయ రంగాలకు వెచ్చించే నిధులు, వడ్డీలు, రుణ చెల్లింపులు ప్రణాళికేతర ఖాతాలోకి వస్తాయి. రాష్ట్ర ప్రభుత్వాలకు ఇచ్చే ప్రణాళికేతర గ్రాంటులు కూడా ఈ ఖాతాలో ఉంటాయి.

**ప్రభుత్వఖాతా (పబ్లిక్ అకౌంట్) :** సంచిత నిధిలో జమయ్యే వసూళ్లు మినహా ప్రభుత్వం వద్దకు వచ్చే ఇతర అన్ని రకాల నిధులు ఈ ఖాతాలో జమ అవుతాయి. పార్లమెంటు అనుమతి లేకుండానే ఈ ఖాతాలోని నిధులను ఉపయోగించుకోవచ్చు. రిజర్వ్ బ్యాంకు నుంచి, పీఎఫ్(భవిష్యనిధి) నుంచి తీసుకునే రుణాలను ఈ ఖాతా కింద ఖర్చు చేస్తారు. ఈ సొమ్మును మళ్లీ చెల్లించాల్సి ఉంటుంది.

**రెవెన్యూ వసూళ్లు (రెవెన్యూ రిసీట్స్) :** పన్నులు, సుంకాలద్వారా వసూలయ్యే ఆదాయమే రెవెన్యూ వసూళ్లు, కస్టమ్స్ సుంకాలు, ఎక్సైజ్ డ్యూటీ, కార్పొరేట్ టాక్స్, ఇతరత్రా పన్నుల రూపంలో వచ్చే సొమ్మంతా ఈ ఖాతాలోకే చేరుతుంది. ప్రభుత్వ పెట్టుబడులపై వడ్డీలు, డివిడెండ్ల రూపంలో వచ్చే ఆదాయం, ప్రభుత్వ సేవలపై వసూలు చేసే చార్జీలు వీటి కిందకే వస్తాయి.

రెవెన్యూ వ్యయం (రెవెన్యూ ఎక్స్‌పెండివర్): ప్రభుత్వ నిర్వహణ, ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, వడ్డీ చెల్లింపులు, సబ్సిడీలు, బదిలీలపై చేసే ఖర్చును రెవెన్యూ వ్యయంగా పేర్కొంటారు. ఇది ప్రభుత్వానికి ఎలాంటి ఆస్తులను సృష్టించదు.

**రెవెన్యూ లోటు (రెవెన్యూ డెఫిసెట్) :** రెవెన్యూ వసూళ్లు, రెవెన్యూ వ్యయానికి మధ్య తేడా.

**ప్రత్యక్షపన్నులు (డైరెక్ట్ టాక్స్) :** ప్రభుత్వానికి మనం నేరుగా చెల్లించే పన్నులు ఇవి. ఆదాయ పన్ను, సంపద పన్ను, ఫ్రింజ్ బెనిఫిట్ టాక్స్ (ఉద్యోగుల ప్రోత్సాహకాలపై విధించే పన్ను).. మొదలైనవన్నీ దీనిలోకే వస్తాయి.

**పరోక్ష పన్నులు (ఇన్‌డైరెక్ట్ టాక్స్) :** మనం చేసే వ్యయాలపై పరోక్షంగా విధించే పన్ను. కస్టమ్స్, ఎక్సైజ్, సర్వీస్ టాక్స్‌లన్నీ దీని పరిధిలోకే వస్తాయి.

## ధరలు తరిగేవి

- **మొబైల్ మెమొరీ కార్డ్లు, ఛార్జర్లు**
- **వెండినగలు**
- **బ్రాండెడ్ దుస్తులు**
- **దిగుమతి చేసుకునే ఎల్‌సీడీ, ఎల్ఈడీ టీవీలు**
- **అగ్గిపెట్టెలు**
- **రూ.500 లోపు చెప్పులు**
- **సోయా ఉత్పత్తులు**
- **పెన్నులు**
- **దిగుమతి చేసుకునే వైద్య పరికరాలు**

# పేద్దుల చిట్టాలా రైల్వేబడ్జెట్: జేపీ

భారతీయ రైల్వేలను ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా చేసే ఎటువంటి నిర్మాణాత్మక వ్యూహాన్నీ 2012-13 రైల్వేబడ్జెట్ వెలువరించలేకపోయింది.

దశాబ్దాల నిర్లక్ష్యం, ఏళ్ల తరబడి జనాకర్షక విధానాలు రైల్వేరంగాన్ని సంక్షోభంలోకి నెటాయి. దాదాపు 150 ఏళ్ల క్రితం వెచ్చించిన పెట్టుబడుల మీద లాభాలను ఆర్జించాల్సిన రైల్వేవిభాగం ఆ లక్ష్యసాధనలో విఫలమై ఇప్పుడు భారీ వడ్డీలకు అప్పులు తెచ్చి ప్రాజెక్టులు చేపడుతోంది. దీనివల్ల చాలా ప్రాజెక్టులు తలకుమించిన భారంగా మారుతున్నాయి.

"రైల్వేల నిర్లక్ష్యం వల్ల సరుకు రవాణాలో ఎక్కువవాటా రోడ్డురవాణా వైపు మళ్లింది. ఫలితంగా రోడ్ల మీద భారం పెరిగింది. రోడ్డురవాణా వల్ల ఇంధన వ్యయం పెరగటంతోపాటు వాహన కాలుష్యం వివరీత మవుతోంది".

పట్టణ ప్రాంతాలలో ప్రజారవాణా పట్ల రైల్వేమంత్రి తగినంత శ్రద్ధ చూపలేదు. రైలు, రోడ్డు, మెట్రో రవాణాను సంధానం చేసి ఒకే టికెట్ మీద ప్రయాణీకులు వెళ్లగలిగే వినూత్న ప్రణాళికలను రైల్వే మంత్రి ప్రకటించి ఉండాల్సింది. మొత్తంగా చూస్తే, రైల్వేబడ్జెట్ ఎటువంటి సృజనాత్మకత లేకుండా రైళ్ల వంపకాలు, కేటాయింపులతో గుమాస్తా రాసిన లెక్కల పత్రంలా ఉంది.

హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్

**ఛార్జీలు ఇలా....**

| దూరం కి.మీ. | ప్రస్తుతం | పెంచాక |
|---|---|---|
| 37 | 7 | 10 |
| 23 | 4 | 5 |
| 15 | 2 | 5 |
| 8 | 2 | 5 |
| 24 | 4 | 5 |
| 25 | 4 | 5 |

ఎంఎంటీఎస్‌లో ఇప్పటిదాకా కనీస ఛార్జీ రూ. 2 ఉండగా

| సబర్బన్, సాధారణ రైళ్లలో రెండో తరగతికి | మెయిల్ - ఎక్స్‌ప్రెస్‌లలో రెండో తరగతికి | స్లీపర్ తరగతికి | ఏసీ చైర్‌కార్, మూడో తరగతి ఏసీకి (3టైర్) | రెండో తరగతి ఏసీకి (2టైర్) | ఏసీ మొదటి తరగతి (ఫస్ట్ ఏసీ) |
|---|---|---|---|---|---|
| 2 పైసలు ప్రతి కి.మీ. కి | 3 పైసలు ప్రతి కి.మీ. కి | 5 పైసలు ప్రతి కి.మీ. కి | 10 పైసలు ప్రతి కి.మీ. కి | 15 పైసలు ప్రతి కి.మీ. కి | 30 పైసలు ప్రతి కి.మీ. కి |

## దక్షిణ మధ్యరైల్వేలో కొత్తరైళ్లు

- సికింద్రాబాద్ -షాలిమార్ ఏసీ ఎక్స్‌ప్రెస్ వయా విజయవాడ (వారినికొకరోజు)
- సికింద్రాబాద్ - కాకినాడ ఏసీ ఎక్స్‌ప్రెస్ (వారానికి 3 రోజులు)
- సికింద్రాబాద్ - బీదర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (వారానికి 6రోజులు)
- సికింద్రాబాద్ - బెల్లంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ వయా కాజీపేట్
- కాచిగూడ- మదురై ఎక్స్‌ప్రెస్ (వీక్లీ) వయా ధర్మవరం, పాకాల జోలర్‌పేట.
- సికింద్రాబాద్ - దర్భంగ ఎక్స్‌ప్రెస్ (బైవీక్లీ) వయా బల్లార్ష, రూర్కెలా, రాంచి, ఝూఝూ
- సికింద్రాబాద్ - జైపూర్ (వీక్లీ) వయా నగ్దా, భోపాల్, నర్‌ఖేర్, అమరావతి, అకోలా.
- ఆదిలాబాద్ - హుజూర్‌సాహెబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్ (రోజూ) వయా ముద్‌ఖేడ్.
- సికింద్రాబాద్ పోరుబందరు ఎక్స్‌ప్రెస్ (వీక్లీ)వయా వీరంజాం, వాసాయ్‌రోడ్
- తిరుపతి - మన్నార్‌గుడి ఎక్స్‌ప్రెస్ (వారానికి మూడురోజులు) వయా తిరువారూర్, విల్లుపురం, కాట్పాడి
- సికింద్రాబాద్ - నాగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (3 రోజులు) వయా కాజీపేట్.
- కరీంనగర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ (వీక్లీ) వయా పెద్దపల్లి
- హైదరాబాద్ - అజ్మీర్ ఎక్స్‌ప్రెస్ (వీక్లీ) వయా మన్నాడ్, ఇటార్సీ, రత్లాం
- హుజూర్‌సాహెబ్ నాందేడ్ - అమృత్‌సర్ ఎక్స్‌ప్రెస్

## కొత్త ప్యాసెంజర్

- ఎర్రగుంట్ల - నొస్సం/బనగానపల్లి (రోజూ)

## 2012 మార్చి 31 నాటికి పూర్తికాబోయే కొత్త లైన్లు

- జగ్గయ్యపేట - మేళ్లచెరువు
- మెట్‌పల్లి - మోర్తాడ్
- రాయచూరు - పాండురంగస్వామిలో కొంత భాగం
- నొస్సం - బనగానపల్లె
- దేవరకొండ - కృష్ణా (కొంతభాగం)
- హమ్నాబాద్ - హల్లిఖేడ్

**2012 మార్చి 31 నాటికి పూర్తికానున్న డబ్లింగ్ పనులు**

- ఆస్ప్రి - ఇసివి
- తాడిపత్రి-రాయలచెరువు
- నాగోర్ - ఆదోని
- ఆదోని - ఇసివి
- కోరుకొండ-విజయనగరం
- కొత్తవలస - కంటకపల్లి

**2012 - 13 బడ్జెట్‌లో పూర్తిచేయదలచుకున్న డబ్లింగ్ పనులు**

- రాఘవపురం-పెద్దంపేట్
- కోసిగి-మంత్రాలయం
- ఇసివి-కోపుగల్
- కోరుకొండ-ఆలమంద-కంటకపల్లి
- సింహాచలం ఉత్తరం
- గోపాలపట్నం బైపాస్ లైన్

**ఈ బడ్జెట్‌లో మంజూరు చేసిన కొత్త డబ్లింగ్ పనులు**

- ఖాజీపేట్ - విజయవాడ మూడోలైన్

**డబ్లింగ్‌కోసం ప్రణాళికా సంఘం అనుమతికి పంపిన కొత్తలైన్లు**

- బీబీనగర్ - నల్లపాడు
- డోర్నకల్ జంక్షన్ - మణుగూరు (విద్యుదీకరణంతోకలిపి డబ్లింగ్)
- రేణిగుంట - అరక్కోణం మూడోలైను

**కొత్తగా మంజూరు చేసిన విద్యుదీకరణ లైన్లు**

- నల్లపాడు - గుంతకల్లు
- హోస్పేట - గుంతకల్లు
- తోరణగల్లు - రంజిత్‌పుర

**విద్యుదీకరణ సర్వే**

- బీబీనగర్ - పగిడిపల్లి- నల్లపాడు
- మన్మాడ్ - ముద్‌ఖేడ్ - లింగంపల్లి-డోన్

**ప్రణాళికాసంఘం ఆమోదం కోసం పంపే కొత్త లైను ప్రాజెక్టులు**

- ఆర్మూర్ - అదిలాబాద్ వయా నిర్మల్, దొనకొండ-బిట్రగుంట, కొండపల్లి- కొత్తగూడెం, మణుగూరు-రామగుండం, మార్కాపురం-శ్రీశైలం, పాండురంగాపురం-భద్రాచలం, పిడుగురాళ్ల- నరసరావుపేట, కదిరి-పుట్టపర్తి, చిక్కబళ్లాపురం-పుట్టపర్తి, శ్రీనివాసపురం-మదనపల్లి, జహీరాబాద్-సికింద్రాబాద్.

**పొడిగింపులు - 3**

- 16779/16780 - మధురై-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రామేశ్వరం వరకు
- 57502/57503 - బోధన్ - నిజామాబాద్ ప్యాసెంజర్ కామారెడ్డి వరకు
- 56011/56012 - అరక్కోణం - నందలూరు ప్యాసెంజర్ కడప వరకు

**ఇతర రైల్వేల నుంచి పొడిగింపులు**

- 12687/12688 - డెహ్రాడూన్ - చెన్నై ఎక్స్‌ప్రెస్ మధురై వరకు (వయా ఈరోడ్)

**ఫ్రీక్వెన్సీ పెంపు**

- 12731/12732- సికింద్రాబాద్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ 2 నుంచి 4 రోజులకు
- 17003/17004 - హైదరాబాద్ - కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ 2 నుంచి 7 రోజులకు
- 16779/16780 - మధురై - తిరుపతి ఎక్స్‌ప్రెస్ 2 నుంచి 3 రోజులకు
- 12485/12486 - శ్రీగంగానగర్ - హుజుర్‌సాహెబ్ నాందేడ్ ఎక్స్‌ప్రెస్1 నుంచి 3 రోజులకు
- 12641/12642 - నిజాముద్దీన్ - కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ 1 నుంచి 2 రోజులకు
- 22603/22604 - విల్లుపురం - ఖరగ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ 1 నుంచి 2 రోజులకు
- 56523/56524- బెంగుళూరు-హిందూపురం ప్యాసింజర్ 6 నుంచి 7 రోజులకు

**రాష్ట్రప్రభుత్వాలతో కలిసి చేపట్టే ప్రాజెక్టులు**

**ఆంధ్రప్రదేశ్**

- కోటిపల్లి - నర్సాపూర్
- కడప-బెంగుళూరు (బంగార్‌పేట్)
- నడికుడి - శ్రీ కాళహస్తి
- విజయవాడ-గుడివాడ-భీమవరం- నర్సాపూర్, గుడివాడ-మచిలీపట్నం-భీమవరం- నిడదవోలు (డబ్లింగ్, విద్యుదీకరణ)
- రాయదుర్గం- తుమకూరు వయా కళ్యాణదుర్గం
- మునీరాబాద్-మహబూబ్‌నగర్

**కర్నాటక**

- గుల్బర్గా- బీదర్

**ఆదర్శ స్టేషన్లు**

దువ్వాడ, జల్నా, కోకర్ని నరసింహ, మాచెర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, వినుకొండ

**2012-13 బడ్జెట్‌లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్న కొత్తలైన్లు**

- బనగానపల్లి-నంద్యాల
- రాయచూరు-గద్వాల
- మోర్తాడ్-ఆర్మూర్
- కడప-గంగనపల్లి
- రాయదుర్గం-ఆవులదట్ల
- మరికేల్-మక్తల్

# ఐదు రాష్ట్రాల ఎన్నికలు : సంక్షోభంలో జాతీయ పార్టీలు

- డి.వి.వి.యస్. వర్మ

ఐదు రాష్ట్రాల ఉప ఎన్నికలలో జాతీయ పార్టీలకు ఎదురుదెబ్బలే మిగిలాయి. ఒక జాతీయ పార్టీ మునిగితే మరొక జాతీయ పార్టీ ఎదగడానికి బదులు కాంగ్రెస్, బి.జె.పి పార్టీలకు ఈ ఎన్నికలు ఎలాంటి ఊరటనీ కలిగించలేదు. దీనికి భిన్నంగా ఉత్తరప్రదేశ్‌లో ఒక ప్రాంతీయ పార్టీ మునిగితే మరో ప్రాంతీయ పార్టీ పుంజుకోవడం కనిపిస్తున్నది.



మణిపూర్‌లో కాంగ్రెస్ విజయాన్ని సాధిస్తే, గోవాను కోల్పోయింది. బి.జె.పి. గోవాను గెల్చుకుంటే, ఉత్తరాఖండ్‌ని పొగొట్టుకుంది.

## మణిపూర్ తుది ఫలితాలు

| పార్టీ | 2007 | | 2012 | | తేడా | |
|---|---|---|---|---|---|---|
| | సీట్లు | ఓట్లుశాతం | సీట్లు | ఓట్లుశాతం | సీట్లు | ఓట్లుశాతం |
| కాంగ్రెస్+సిపిఐ | 34 | 40 | 42 | 41 | 8 | 1 |
| తృణమూల్ కాంగ్రెస్ | - | | 7 | 16 | - | - |
| ఎన్‌పీఎఫ్ | 3 | 3 | 4 | 8 | 1 | 5 |
| ఎంపీపి | 5 | 15 | - | - | - | - |
| ఇతరులు | 17 | 41 | 7 | 35 | | |

పంజాబ్‌లో కాంగ్రెస్ కొన్ని స్థానాలు పెంచుకున్నా, ఉత్తర ప్రదేశ్‌లో 2009 పార్లమెంటు ఎన్నికలు విజయాలను నిలబెట్టుకోలేకపోయింది. అలాగే బి.జె.పి పంజాబులో తన మిత్రపక్షంతో కలిసి విజయాన్ని సాధించినా ఆ పార్టీకి మాత్రం



## గోవా తుది ఫలితాలు

| పార్టీ | 2007 | | 2012 | | తేడా | |
|---|---|---|---|---|---|---|
| | సీట్లు | ఓట్లుశాతం | సీట్లు | ఓట్లుశాతం | సీట్లు | ఓట్లుశాతం |
| భాజపా | 14 | 30 | 21 | 39 | 7 | 9 |
| కాంగ్రెస్ | 16 | 32 | 9 | 32 | -7 | 0 |
| మహారాష్ట్రవాది గోమంతక్ | 2 | 9 | 3 | - | 1 | - |
| ఇతరులు | 8 | 29 | 7 | 29 | -1 | |



## పంజాబ్ తుది ఫలితాలు

| పార్టీ | 2007 | | 2012 | | తేడా | |
|---|---|---|---|---|---|---|
| | సీట్లు | ఓట్లుశాతం | సీట్లు | ఓట్లుశాతం | సీట్లు | ఓట్లుశాతం |
| ఎస్ఏడీ | 48 | 37 | 56 | 42 | 8 | 5 |
| కాంగ్రెస్ | 44 | 41 | 46 | 40 | 2 | -1 |
| భాజపా | 19 | 8 | 12 | - | -7 | - |
| ఇతరులు | 6 | 14 | 3 | 18 | -3 | - |

స్థానాలు తగ్గాయి. ఇదే పరిస్థితి ఉత్తర ప్రదేశ్‌లోనూ ఎదురైంది.

మొత్తంమీద ఈ ఎన్నికల ఫలితాల పర్యవసానంగా జాతీయ రాజకీయాలు ఒక సంధికాలంలో ప్రవేశించాయి. యు.పి.ఎ ప్రభుత్వం తన ప్రతిష్టను కోల్పోయింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోగల స్థితిలో బి.జె.పి. లేదు.

ఒకరు అధికారంలో నిలదొక్కుకోలేని స్థితి. మరొకరు అధికారాన్ని చేజిక్కించుకోలేని స్థితిని ఈ సంధికాలం సూచిస్తున్నది. ఇది ఒక తాత్కాలిక రాజకీయ శూన్యం. దీనిని ఎవరు ఎలా పూడుస్తారు అన్న దానిమీదే దేశ రాజకీయ భవిష్యత్తు ఆధారపడుతుంది.

ఈ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీలలో నెలకొన్న నాయకత్వ సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేశాయి. భావిప్రధానిగా భావిస్తున్న రాహుల్ గాంధీ, ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారానికి తురుపుముక్కగా వినియోగపడుతున్న ప్రియాంక, కాంగ్రెస్ చక్రం తిప్పుతున్న సోనియాగాంధీలకు ఈ ఎన్నికల ఫలితాలు చుక్కెదురయ్యాయి. సోనియా ప్రాతినిధ్యం వహిస్తున్న రాయబరేలీలోని శాసనసభ స్థానాలను గెలిపించుకోలేకపోవడం వారి నాయకత్వానికి ఆశనిపాతం అయింది. ఈ పరిణామాలు యుపిఎ మిత్రపక్షాలలో కలకలం రేపుతున్నాయి. మొత్తంమీద యు.పి.ఎ కూటమి బద్దలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాబోయే రెండేళ్లు యు.పి.ఎ.





## ఉత్తరప్రదేశ్ తుది ఫలితాలు

| పార్టీ | 2007 | | 2012 | | తేడా | |
|---|---|---|---|---|---|---|
| | సీట్లు | ఓట్లశాతం | సీట్లు | ఓట్లశాతం | సీట్లు | ఓట్లశాతం |
| బీఎస్పీ | 206 | 30 | 80 | 26 | -126 | -4 |
| ఎస్పీ | 97 | 25 | 224 | 29 | 127 | 4 |
| భాజపా | 51 | 17 | 47 | 15 | -4 | -2 |
| కాంగ్రెస్ | 22 | 9 | 28 | 14 | 6 | 5 |
| ఆర్ఎల్డీ | 10 | 4 | 9 | 2 | -1 | -2 |
| పీస్ పార్టీ | - | - | 4 | 2 | - | - |
| ఇతరులు | - | - | 11 | 12 | - | - |

ఇలాంటి పాలనా నిష్క్రియా పరత్వాన్ని కొనసాగిస్తే దాని పుట్టి మునిగిపోవడం ఖాయం అవుతుంది. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ పాలనాపరంగా తీసుకునే చొరవల మీద, సాహసోపేతమైన చర్యల మీదే దాని భవిష్యత్తు ఆధారపడి వుంది. అయితే అలాంటి చర్యలు తీసుకునే సూచనలు అంతగా కనిపించడం లేదు.

మరొక పక్క ప్రత్యామ్నాయం కావలసిన బి.జె.పి పరిస్థితి కూడా దయనీయంగానే వుంది. బి.జె.పి.కి స్పష్టమైన ప్రత్యామ్నాయ రాజకీయ విధానాలు లేకపోగా ఎప్పటికెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడి అన్న చందంగా అది రాజకీయంగా వ్యవహరిస్తున్నది. ఒక పక్క తన విద్వేష రాజకీయాలని వదులుకోవడమూ లేదు – మరొక పక్క ఒక విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ విధానాలను ప్రతిపాదించడమూ లేదు. ఈ రాజకీయ గందరగోళంతో పాటు బి.జె.పి. ఇప్పుడు నాయకత్వ సంక్షోభంలో కూరుకుని పోయింది. నివురుగప్పిన నిప్పులా అంతర్గత కుమ్ములాటలలో నిమగ్నమై వుంది.

ఒక పక్క బి.జె.పి. కి అధ్యక్షుడుగా వున్న గడ్కరీ



## ఉత్తరాఖండ్ తుది ఫలితాలు

| పార్టీ | 2007 | | 2012 | | తేడా | |
|---|---|---|---|---|---|---|
| | సీట్లు | ఓట్లశాతం | సీట్లు | ఓట్లశాతం | సీట్లు | ఓట్లశాతం |
| కాంగ్రెస్ | 21 | 30 | 32 | 34 | 11 | 4 |
| భాజపా | 34 | 32 | 31 | 33 | -3 | 1 |
| బీఎస్పీ | 8 | 12 | 3 | - | -5 | - |
| యూకేకేడీ | 3 | 5 | 1 | - | -2 | - |
| ఇతరులు | 4 | 21 | 3 | 33 | -1 | - |

సహజసిద్ధంగా అధ్యక్షుడిగా ఎదిగిన నాయకుడు కాకపోవడం, ఆ పార్టీలో సీనియర్ నాయకులే గ్రూపు విభేదాలకు నాయకత్వ వహించడంతో పరిస్థితి బాగా దిగజారింది. ఒకపక్క గుజరాత్ ముఖ్యమంత్రి మోడీ ప్రధాని అభ్యర్థిగా పోటీపడుతూనే ఆర్.ఎస్.ఎస్‌తో ఘర్షణకు దిగుతున్నారు. యు.పి ఎన్నికల ప్రచారంలో పాల్గొనకపోవడానికి, ఆ ప్రచార బాధ్యతలను ప్రముఖ ఆర్.ఎస్.ఎస్.నేతకి అప్పగించడమే కారణంగా భావిస్తున్నారు. ప్రస్తుతం బి.జె.పి నాయకత్వం ఎవరికి వారే యమునా తీరేగా వ్యవహరిస్తున్నారు. 2014 వరకు ఇదే పరిస్థితి కొనసాగితే అధికారం అందుకోడానికి దానికి వస్తున్న అవకాశాలు చేజారిపోవడం ఖాయం.

ఈ పరిస్థితులలో ఉత్తర ప్రదేశ్‌లో ఎన్నికల ఫలితాలు ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇక్కడ ఏపార్టీకి మెజారిటీరాని అనిశ్చిత పరిస్థితి వుంటుందని అందరూ అంచనాలు వేశారు. కాని ఉత్తరప్రదేశ్ ప్రజలు మాత్రం స్థిరత్వానికి ఓటు వేశారు. గతంలో మాయావతికి కూడా ఇలాంటి తీర్పునే ఇచ్చారు. మొత్తం మీద ఈ అయిదు రాష్ట్రాల్లో ఒక్క ఉత్తరాఖండ్ మినహాయిస్తే అన్ని రాష్ట్రాలతోనూ ప్రజలు నిస్పష్టమైన తీర్పునే ఇచ్చారు. ఇదొక శుభపరిణామం. హంగ్ అసెంబ్లీలను అధిగమించే పరిమితిని ఓటర్లు ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లో అస్పష్టమైన తీర్పుకు కూడా కారణాలు కనిపిస్తున్నాయి. ఒకపక్క అవినీతి కుంభకోణాలలో కురుకుపోయిన కాంగ్రెస్‌ను ఎంచుకోవడంలో ఓటర్లు సందిగ్ధతలోపడినట్లే, మరోపక్క రాష్ట్రంలో అవినీతిపాలన అందించలేని బి.జె.పి. చివరలో

ముఖ్యమంత్రిని మార్చి దిద్దుబాటు చర్యలు తీసుకోవడంతో ఓటర్లు గందరగోళపడినట్లు కనిపిస్తున్నది. ఏమైనా ఉత్తరాఖండ్ తీర్పును జనరలైజ్ చెయ్యడానికి తగినది కాదనేది స్పష్టం.

ఇక ఉత్తరప్రదేశ్ తీర్పు జాతీయస్థాయిలో మూడవ కూటమికి ఆశలు చిగురింపజేస్తున్నట్లు కొందరు భావించడం సహజం. మన దేశంలో మూడవ కూటమి ప్రయోగాలు చాలా జరిగాయి. అయితే అవి రూపుదాల్చిన కొంత కాలానికే అంతర్ధానం కావడం అనుభవంగా మారింది. ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాలలో స్థిరమైన పాలన అందించగలగుతున్నాయి కానీ, జాతీయస్థాయి లో విఫలం అవుతున్నాయి. ఎందుకంటే ఈ ప్రాంతీయ పార్టీలకు ఆయా రాష్ట్రాలలో స్థానిక ప్రయోజనాలే మిన్నగా వుంటున్నాయి. అక్కడ స్థిరపడడానికి జాతీయ రాజకీయాలను, ప్రభుత్వాలను ఈ పార్టీలు సాధనాలుగా వినియోగించుకుంటున్నాయి. రాష్ట్రాలలో తమ పార్టీల ప్రయోజనాల చుట్టూ తిరిగే పార్టీలు జాతీయ స్థాయిలో స్థిరమైన ప్రభుత్వాలకు ప్రాధాన్యత ఇచ్చే స్థితి లేకుండా పోతున్నది. అందుకే ఇలాంటి ప్రాంతీయ పార్టీల మూడో కూటమి విఫలం కావడానికి వాటి ప్రయోజనాలే అడ్డంకి అవుతున్నాయి.

ఈ పరిస్థితులలో బలమైన జాతీయ పార్టీల చుట్టూ ప్రాంతీయ పార్టీలు జతకూడడంతోనే జాతీయస్థాయిలో స్థిరమైన సంకీర్ణాలకు అవకాశం వుంటున్నది. అలాంటి కూటములుగానే గతంలో ఎన్.డి.ఎ, ఇప్పుడు యు.పి.ఎ. లు సంకీర్ణ ప్రభుత్వాలను నిర్వహించగలుగుతున్నాయి. దేశప్రజల్లో కూడా ఇలాంటి చైతన్యం నానాటికీ పెరుగుతున్నది. రాష్ట్రాలలో స్థానిక ప్రాంతీయపార్టీలకు పట్టంకడుతూనే జాతీయ స్థాయిలో తీర్పునిచ్చేటప్పుడు ప్రాంతీయ పార్టీలకు, జాతీయపార్టీలకు మధ్య తేడా చూపుతున్నారు. ఇలాంటి సమతూకం ప్రస్తుత పరిస్థితులలో తప్పనిసరి అవుతున్నది. 2009 పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో ప్రజలు ఇలాంటి వివక్షణను స్పష్టంగా చూపించారు. పార్లమెంటు ఎన్నికలలో ప్రాంతీయ పార్టీల కంటే జాతీయ పార్టీలనే ఎంచుకోడానికి ప్రాధాన్యతను ఇచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లో మరికొన్ని రాష్ట్రాలలో జాతీయ పార్టీలు తమ బలానికి మించి పార్లమెంటు ఎన్నికలలో సీట్లు పొందాయి. ఇలాంటి పరిణతి నుంచే అటు రాష్ట్రాలలో ఇటు జాతీయస్థాయిలో స్థిరమైన సంకీర్ణాలకు అవకాశాలు పెరుగుతాయి. ■

# ఎన్నికల్లో అభ్యర్థుల జమాఖర్చులు సరికొత్త నిబంధనలకు కసరత్తు

ఎన్నికల ప్రక్రియలో మరింత పారదర్శకత తీసుకొచ్చి, నల్లధన ప్రవాహాన్ని అడ్డుకొనే చర్యల్లో భాగంగా భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మరో అడుగు ముందుకేసింది.

దేశంలోని రాజకీయ పార్టీల నిధుల నిర్వహణ, తనిఖీల (ఆడిటింగ్)కు సంబంధించి సరికొత్త విధివిధానాలను అమలులోకి తీసుకొనిరానుంది. దీనిలో భాగంగా భారత అధీకృత గణకుల సంస్థ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా-ఐసీఏఐ) రూపొందించిన నిబంధనలు, మార్గదర్శకాలకు ఎన్నికల సంఘం తన అంగీకారం తెలిపింది.

ఈ నిబంధనలు, మార్గదర్శకాలను అన్ని రాజకీయ పార్టీలకు త్వరలో పంపించనుంది. ఆదాయపు పన్ను శాఖ, రిజర్వు బ్యాంకు తదితర ఆర్థిక విభాగాల పరిశీలనకు వీటిని పంపిస్తారు.

**ఐఐడీ ఈ ఎంకు స్వయంప్రతిపత్తిపై వెనక్కి తగ్గిన ఈసీ :**

ఎన్నికల నిర్వహణకు సంబంధించి దేశంలోనూ, దేశం వెలుపలా సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు స్వయంప్రతిపత్తి గల సంస్థను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను ఎన్నికల సంఘం వెనక్కి తీసుకొంది. దీని వల్ల అదనంగా ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదని ప్రధాన మంత్రికి రాసిన లేఖలో ప్రధాన ఎన్నికల అధికార ఎస్.వై. ఖురేషీ తెలిపారు.

# మంత్రులు, ఐఏఎస్‌లకి సుప్రీంకోర్టు తాఖీదులు



గీతారెడ్డి | పొన్నాల లక్ష్మయ్య | కన్నా లక్ష్మీనారాయణ | డి. ప్రసాదరావు | ఎం. వెంకటరమణ | సబితారెడ్డి



సీవీయస్‌కె శర్మ | ఎస్.వి. ప్రసాద్ | ఎం. శామ్యూల్ | మన్మోహన్‌సింగ్ | బి. శ్యాంబాబు | ఆదిత్యనాథ్ దాస్ | వై. శ్రీలక్ష్మి | కె. రత్నప్రభ

***వైఎస్ జగన్ అక్రమాస్తుల కేసులో సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు సంచలనాన్ని సృష్టించాయి....26 ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా కొన్ని కంపెనీలకు అక్రమంగా లబ్ధి చేకూర్చారన్న ఆరోపణలపై సీనియర్ మంత్రులకి, ఐఏఎస్ ఆఫీసర్లకి నోటీసులు జారీ చేసింది. అప్పట్లో కీలక శాఖలు నిర్వహించిన వీరిపై విచారణ ఎందుకు జరపకూడదో వివరణ కోరింది. ఆ 26 ప్రభుత్వ ఉత్తర్వు (జీవో)ల సారాంశం........***

| జీవో నెంబరు | జారీ తేదీ | సారాంశం | జగన్‌కు కలిగిన ప్రయోజనం... |
|---|---|---|---|
| 29 | 7-7-2008 | స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చట్టం కింద వాన్‌పిక్‌కు మినహాయింపులు | నిమ్మగడ్డ ప్రసాద్‌కు చెందిన కంపెనీల ద్వారా జగన్‌కు చెందిన సంస్థల్లోకి రూ॥800 కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చాయి. |
| 30 | 10-7-2008 | వాన్‌పిక్ రాయితీల ఒప్పందానికి ఆమోదం | |
| 31 | 11-7-2008 | వాన్‌పిక్ భూసేకరణ ముసాయిదాకు అనుమతి | |
| 1110 | 15-9-2008 | వాన్‌పిక్ ప్రకాశం జిల్లాలో 6406 ఎకరాల కేటాయింపు | |
| 1115 | 16-9-2009 | గుంటూరు జిల్లాలో వాన్‌పిక్ 5451 ఎకరాల భూముల కేటాయింపు | |
| 865 | 11-7-2008 | కడప జిల్లాలో ఇండియా సిమెంట్స్‌కు భూముల లీజు పొడగింపు | సాక్షిలో ఇండియా సిమెంట్స్ తరపున రూ॥40 కోట్లు, భారతి సిమెంట్స్‌లో రూ॥35 కోట్ల పెట్టుబడి |
| 146 | 22-7-2008 | ఇండియా సిమెంట్స్‌కు 10 లక్షల గ్యాలన్ల కృష్ణానదీ జలాల కేటాయింపు | |
| 94 | 12-8-2009 | ఇండియా సిమెంట్స్‌కు కాగ్నా నది నుంచి 13 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటి కేటాయింపు | |

| | | | |
|---|---|---|---|
| 1490 | 12-12-2008 | పెన్నా సిమెంట్స్‌కు అనంతపురం జిల్లాలో 231 ఎకరాల కేటాయింపు | **పెన్నా గ్రూపు ద్వారా జగన్‌కు చెందిన సాక్షిలోకి రూ॥45 కోట్లు, కార్మెల్ ఏసియాలోకి రూ॥23 కోట్లు పెట్టుబడుల రూపంలో వచ్చాయి.** |
| 91 | 29-3-2008 | పెన్నా సిమెంట్స్‌కు కర్నూలు జిల్లాలో 304 హెక్టార్ల సున్నపురాయి గనుల ప్రాస్పెక్టింగు లైసెన్స్ మంజూరు | |
| 25 | 29-1-2009 | వాల్‌చంద్ తాండూరు సిమెంట్స్ పేరును పెన్నా తాండూరు సిమెంట్స్‌గా మార్పు | |
| 76 | 26-2-2009 | పెన్నా తాండూరు సిమెంట్స్‌కు రంగారెడ్డి జిల్లాలో 822.13 ఎకరాల్లో సున్నపురాయి గనుల లీజు | |
| 305 | 7-11-2008 | రఘురామ్ సిమెంట్స్‌కు 2037.52 ఎకరాల సున్నపురాయి లీజుల నుంచి 475.16 ఎకరాలు ప్రభుత్వ స్వాధీనానికి అనుమతి | **ఇవన్నీ జగన్ సొంత సంస్థలే** |
| 104 | 3-2-2009 | రఘురామ్ సిమెంట్స్‌కు 39.55 ఎకరాలకు సీలింగు చట్టం నుంచి మినహాయింపు | |
| 54 | 13-2-2009 | రఘురామ్ సిమెంట్స్ పేరు భారతీ సిమెంట్స్‌గా మార్పు | |
| 293 | 26-2-2009 | రఘురామ్ (భారతి) సిమెంట్స్‌కు 79.37 ఎకరాలకు సీలింగు చట్టం నుంచి మినహాయింపు | |
| 107 | 18-5-2009 | సరస్వతి పవర్ లిమిటెడ్‌కు 266 హెక్టార్లలో సున్నపురాయి గనుల లీజు | |
| 12 | 26-2-2010 | రాంకీ ఫార్మా సిటీకి స్టాంపు డ్యూటీ రిజిస్ట్రేషన్ల ఫీజుల వాపసు | **రాంకీ గ్రూపునకు చెందిన సంస్థలు సాక్షిలోకి దాపు రూ॥10కోట్లను పెట్టుబడి రూపంలో తరలించాయి** |
| 136 | 19-2-2009 | చెత్తశుద్ధి నిర్వహణ ప్రాజెక్టు రాంకీ సంస్థకి అప్పగింత | |
| 1435 | 4-12-2008 | రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలో రాంకీ ఎస్టేట్స్ టౌన్‌షిప్ ప్రాజెక్టుకు స్టాంపు రిజిస్ట్రేషన్ల ఫీజు మినహాయింపు | |
| 321 | 8-12-2008 | ఈశ్వర్ సిమెంట్స్ నుంచి దాల్మియా సిమెంట్స్‌కు 407 హెక్టార్ల మైనింగు లీజు బదలాయింపు | **జగన్‌కు చెందిన భారతి సిమెంట్స్‌లో రూ॥95 కోట్లు పెట్టుబడి పెట్టారు.** |
| 151 | 18-6-2007 | గాలి జనార్ధన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనిగ్ కంపెనీకి 68.5 హెక్టార్ల ఇనుప ఖనిజం లీజు | ఈ నాలుగు ఉత్తర్వులు గాలి జనార్ధన్ రెడ్డికి ప్రయోజనాలు కల్పించినవి. వైఎస్ సర్కారు అన్ని విధాలా అందించిన అండదండలతో రూ॥వేల కోట్ల విలువైన ఇనుప ఖనిజాన్ని గాలి అక్రమంగా ఎగుమతి చేశారు. ప్రతిఫలంగా జగన్‌కు అనేక మేళ్లు చేశారు. ఓబుళాపురం గనుల నుంచి వచ్చిన ఆదాయం ద్వారా ఆర్‌ఆర్ గ్లోబల్ అనే సంస్థ జగన్ కంపెనీల్లోకి దాదాపు రూ॥80కోట్లను మళ్లించింది. ఆర్‌ఆర్ గ్లోబల్ సంస్థ జగన్ ఆత్మీయులది. వైఎస్ ప్రభుత్వం గాలికి కేటాయించిన 68.5 హెక్టార్ల గనుల నుంచి ఉత్పత్తయ్యే ఖనిజంలో 50% రెడ్‌గోల్డ్‌కు దక్కేలా ఒప్పందం కుదిరింది. రెడ్‌గోల్డ్ కూడా ఆర్‌ఆర్ గ్లోబల్‌కు సంబంధించిన వ్యక్తులది కావడం గమనార్హం. |
| 152 | 10-8-2007 | ఓఎంసీకి 39.48 హెక్టార్లలో ఇనుప ఖనిజం గనుల లీజు మంజూరు | |
| 477 | 2-8-2007 | కడప జిల్లా జమ్మలమడుగులో బ్రహ్మణి స్టీలు పరిశ్రమ ఏర్పాటుకు ఉత్తర్వులు | |
| 785 | 8-6-2007 | బ్రహ్మణి ఇండస్ట్రీస్‌కు కడప జిల్లా జమ్మలమడుగులో 10,760 ఎకరాల కేటాయింపు | |
| 382 | 25-3-2008 | రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలో బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 250 ఎకరాలకు సీలింగ్ చట్టం నుంచి మినహాయింపు | బ్రాహ్మణి ఇన్‌ఫ్రాటెక్‌కు సెజ్‌ను కేటాయించి, ఆ తర్వాత దానిని అభివృద్ధి ఒప్పందం పేరిట మంత్రి డెవలపర్స్‌కు అప్పగించడం ద్వారా జగన్ బెంగళూరులో ఆ సంస్థకు చెందిన రూ॥400 కోట్ల విలువైన భవనాన్ని సొంతం చేసుకున్నారు. |

# కులం ఏదైనా అందరూ ఎదగాలి

- దామోదర్ రాజనర్సింహ
ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి

మానవుడికి ఒకే కులం, ఒకే మతం, అకే దేవుడు ఉండాలన్న అద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన శ్రీ నారాయణ గురు ఒక అపురూప సామాజిక తత్త్వవేత్త.

**'కులం గురించి అడగకు, చెప్పకు, ఆలోచించకు'....**

'కులం ఏదైనప్పటికీ మనిషి ఎదగాలి'... అని ఉద్బోదించిన శ్రీనారాయణ గురు కేరళలోని త్రివేంద్రం దగ్గరలో ఉన్న 'చెపంజంటి' అనే ప్రాంతంలో 'ఎజవ' అనే అత్యంత వెనుకడిన కులంలో 1856లో జన్మించారు. కులం, మతం పేరుతో ఆ కాలంలో ఈ తెగవారు దారుణంగా అణిచి వేయబడ్డారు.



నారాయణగురు కాలంలో కుల భావన తప్పుగాదు. ఇతర కులాల వారు విధించే పరిధులు మూర్ఖంగా ఉండేవి. శూద్రులు శరీరం పై భాగంలో వస్త్రాలు ధరించడానికి వీలులేదు. మతపరమైన కార్యకలాపాల్లో జంతుబలి ఉండేది. ఇతర అగ్రకూలాల వారికి దూరంగా ఉండవలసివచ్చేది. పరిధులు అతిక్రమించిన వారికి శిక్షలు కఠినంగా ఉండేవి. కేవలం అగ్ర వర్ణ హిందువులు మాత్రమే ప్రభుత్వోద్యోగాలకు అర్హులు, హత్యానేరం వంటి వాటి నుంచి బ్రాహ్మణులకు తప్పించుకొనే వెసులుబాటు ఉండేది. శూద్రులు మొదలైన హిందూ కులేతరులకు చిన్న నేరాలకు సైతం మరణ శిక్ష వంటి కఠినమైన శిక్షలు అమలు పరిచే వారు.

ఈ విధమైన అత్యంత దారుణ పరిస్థితుల మధ్య పెరిగిన శ్రీనారాయణగురు తన 23వ ఏటనే నిమ్న అంటరాని కులాల విద్యార్థుల కోసం ఒక పాఠశాలను ప్రారంభించాడు. ఆధ్యాత్మిక, మత సంబంధిత అంశాల అధ్యయనం పట్ల అత్యంత ఆసక్తి కనబరిచే నారాయణన్ క్రమంగా 'వైరాగ్య స్థితి'లోకి మారడం ప్రారంభించాడు. తాను పెళ్ళాడిన కాలి అమ్మకు విడాకులు ఇచ్చి ఇంటినుంచి దూరంగా వెళ్ళిపోయాడు. మానవత్వం గురించి అధ్యాయనం చేశాడు. పేదల జీవితాలకు దగ్గరయి వారిలో ఒకడుగా జీవించాడు. వారి సమస్యలు తెలుసుకొన్నాడు. మానవత్వానికి దగ్గరయినప్పుడు ఆయన ఎన్నో గొప్ప సత్యాలను గ్రహించాడు. ప్రతి మనిషిలోనూ దైవత్వం ఉందని తెలుసుకొన్నాడు. అనారోగ్యకర ఆలోచనలతో ఈ దైవత్వాన్ని అణిచేస్తున్నామని భావించాడు. వర్ణవ్యవస్థ, మను ధర్మాలను వ్యతిరేకించి వాటిని రూపుమాపడానికి పూనుకొన్నాడు. వీటికి ప్రత్యామ్నాయంగా శ్రీనారాయణ ధర్మాన్ని ప్రచారం చేశాడు. దీనికోసం శ్రీనారాయణ ధర్మ పరిపాలన యోగం (ఎస్ఎన్‌డిపి) అనే ఒక సంస్థను స్థాపించాడు.

**వర్ణధర్మం చేసిన హాని :-** మను ధర్మ వ్యవస్థ సమాజాన్ని విభజించింది. బ్రాహ్మణులు అగ్రస్థానంలోనూ శూద్రులు అట్టడుగున ఉంటారు. క్షత్రియులు, వైశ్యులు మధ్యస్థంగా ఉంటారు. వీరికి అదనంగా పంచములు ఉంటారు. వీరు అంటరానివారు లేదా కులహీనులు.

నారాయణగురు కాలంలో కేరళలో కుల వ్యవస్థ పతాకస్థాయిని చేరింది. అగ్రస్థానంలో ఉన్న బ్రాహ్మణుల్లో కూడా చాలామంది సనాతన, సంప్రదాయ ఆచారాల బారిన పడ్డవారే. బహు భార్యాత్వం, స్త్రీలు అవివాహితులుగా మిగిలి పోవడం వంటివి జరిగేవి.

శూద్రుల్లోనూ, అస్పృశ్యుల్లోను అనేకానేక అవమానాలకు గురయిన వారు ఎంతో మంది. ఈ పరిస్థితులను చూసిన స్వామివివేకానంద కేరళను మతిస్థిమితం కోల్పోయిన వారి ఆశ్రమంగా వర్ణించాడు.

నారాయణగురు ఈ దురవస్థను చూసి చలించిపోయాడు. అద్వైత సిద్ధాంతం ఆధారంగా ఆయన ఒక నూతన 'ధర్మాన్ని' ప్రతిపాదించాడు. ప్రపంచంలోని అన్ని జీవుల్లో ప్రకాశించేది ఒకే సార్వత్రిక జీవాత్మ. వర్ణ వ్యవస్థ ఈ మౌలిక ఏకత్వాన్ని విస్మరించింది. బలవంతపు భేద భావం అద్వైతాన్ని నిరాకరించడమే అవుతుంది. అంటరానితనం, వర్ణవ్యవస్థలు

అద్వైత విధానానికి అటంకాలే.

మానవత అంతా ఒకే బాటను అనుసరిస్తుంది. కాబట్టి, అద్వైతం అధారంగా నారాయణ గురు ఈ ఏకత్వ తత్వ సిద్ధాంతాన్ని లేవనెత్తాడు. ఈ తత్వం కేరళ సామాజిక వ్యవస్థలో ఒక అద్భుతాన్ని సృష్టించింది. 'అలువ' ప్రాంతంలో స్థాపించిన అశ్రమానికి ఆయన అద్వైతాశ్రమమని నామకరణం చేశాడు.

నారాయణగురు గొప్ప సామాజిక ఉద్యమకారుడిగా పనిచేశాడు. కాని ఈ ఉద్యమం శాంతియుతమైంది. కేరళ అంతటా ఆయన పేరు మారుమ్రోగిపోయింది. 'నాను'. నాను స్వామిగా, నారాయణగురుగా, గురుస్వామిగా అంతిమంగా దేవుడిగా మిగిలిపోయాడు.

**నారాయణగురు సిద్ధాంతాలు :**

- అందరికీ ఒకేకులం, ఒకే మతం, ఒకే దైవం.
- ఎవరి కులమూ అడుగకు, ఎవరికి నీ కులం చెప్పకు. కులం గురించి ఆలోచించకు.
- మనిషి తనకు నచ్చిన మతం అనుసరించుకొనే స్వేచ్ఛ ఇవ్వాలి.
- మతం ఏదైనా, మనిషి తనంతట తాను ఎదగాలి.
- విద్య ద్వారా స్వేచ్ఛ, ఏకత్వం ద్వారా బలం, పరిశ్రమల ద్వారా ఆర్థిక స్వావలంబన చేకూరతాయి.

మానవుడు ఏ పని నిర్వహించినా తన సంతోషం, మానసిక ఆనందం కోసమే. ఇది సార్వత్రిక సత్యం. అన్ని మత సిద్ధాంతాలు, నమ్మకాలు, భావనలు మానవుల సంతోషం కోసం పాటుపడతాయి. ఇది మానవ ప్రయత్నాలన్నింటిలోకి అతి ముఖ్యమైన అంశం. అత్యంత అవశ్యకమైన ఈ భావనను అందరూ అంగీకరించవలసిందేనని నారాయణ గురు ప్రపంచానికి తెలియజెప్పారు.

మనిషి తన ఆనందం కోసం చేసే ప్రయత్నం, కృషీ ఇతరులకూ సంతోషకరం కావాలి అంటాడు నారాయణగురు.

'ఒరు జాతి, ఒరుమతం, ఒరుదేవమ్ మనుష్యమ్' అంటూ దేవుడి ముందు మనుషులంతా సమానమే నారాయణ గురు సిద్ధాంతం సర్వదా ప్రశంసనీయమైంది.

గురు అన్నింటికంటే మరో ముఖ్యమైన అంశాన్ని ప్రకటించారు. ఇక గుళ్ళు, గోపురాలు నిర్మించడం తగ్గించాలి. దేవాలయాలు, దేవుళ్ళపై ప్రజలకు నమ్మకం సడలుతోంది. వీటి నిర్మాణంలో పెద్ద మొత్తాలు వెచ్చించడం భావ్యం కాదు. పాఠశాలలు నిర్మించండి. అవే పెద్ద దేవాలయాలు, వాటి నుంచి సంస్కృతి, విజ్ఞానం నేర్చుకొంటాం. ప్రేమ, సమ భావనను నేర్చుకొంటాం. అని నారాయణగురు అందరి కంటే ఉన్నతంగా ఆలోచించాడు. 'చిన్న చిన్న పరిశ్రమలు, కర్మాగారాలు స్థాపించి ప్రజలకు పని సంస్కృతిని పెంపొందించాలని పారిశ్రామిక వేత్తలను కోరాడు నారాయణగురు.

మనుషుల విద్యాస్థాయిలో ఆర్థిక స్థితిగతుల్లో భేద భావాలుండవచ్చు కానీ మానవులంతా ఒక్కటేనని ప్రకటించారు. గురు, ఎన్నిభాషలు, సంస్కృతులు, కులాలు ఉన్నప్పటికీ మానవ జాతి మౌలికమైన అసలైన కులం మానవత్వమేనని ఒక అపురూపమైన సందేశం ఇచ్చారు. ఒక ఆవు రంగు, రూపు వంటి బాహ్య స్వరూపం వేరయినా అన్ని ఆవులూ ఇచ్చే పాలు ఒక్కటే. ఇదే తత్వం మనుషులకూ వర్తిస్తుంది అన్నాడు. నారాయణగురు ధర్మ, తత్వ సిద్ధాంతాలు ఆయనకు మహాత్మాగాంధీ, బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతీరావు పూలే, ఇ.వి.రామస్వామి నాయకర్ వంటి ఆధునిక భారతదేశ తత్వవేత్తల సరసన నిలబెట్టాయి. నారాయణ గురు 1928 సెప్టెంబర్ 20న కేరళలోని తనకు అత్యంత ప్రీతిపాత్రమైన ఊరు వర్కలలో పరమవదించారు.

ప్రపంచం ఒక తత్వవేత్తను కోల్పోయింది. ఒక సామాన్యరైతు బిడ్డ అసన్, యోగి, గురు అంతిమ లోకానికి చేరుకున్నాడు.

గొప్ప తత్వవేత్తలయిన మహాత్మ గాంధీ, రవీంద్రనాథ్ టాగూర్ వంటి వారు సరసన నిలబడగలిగిన వాడుగా నారాయణ గురును ప్రఖ్యాత ఫ్రెంచ్ సాహిత్యకుడు రోమెయిన్ రోలండ్ అభివర్ణించాడు.

గురు ప్రతిపాదిత – ఒకే కులం, ఒకే మతం, ఒకే దైవం, సిద్ధాంతం, కులం– అడగకు, చెప్పకు, ఆలోచించకు అన్న తత్వం విద్యద్వారా స్వాతంత్ర్యం వ్యవస్థ ద్వారా, సమగ్రత శ్రమ ద్వారా అభివృద్ధి నినాదానికి సార్థకత చేకూరాలంటే వాటిని ఆచరించడం ద్వారా మాత్రమే సుసాధ్యం.

చిన్న, చిన్న పరిశ్రమలు, కర్మాగారాలు స్థాపించి ప్రజలకు పని సంస్కృతిని పెంపొందించాలని పారిశ్రామిక వేత్తలను కోరిన తాత్వికుడు నారాయణ గురు. మనుషుల విద్యాస్థాయిలో, ఆర్థిక స్థితిగతుల్లో భేదభావాలుండవచ్చు కాని మానవులంతా ఒక్కటేనని ఆయన ప్రకటించారు. ఎన్ని భాషలు, సంస్కృతులు, కులాలు ఉన్నప్పటికీ మానవ జాతి మౌలికమైన, అసలైన కులం మానవత్వమేనన్నది నారాయణ గురు సందేశం. ■

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో...)

# అన్నివర్గాల ప్రజలనూ అమితంగా ఆకట్టుకున్న జేపీ 'రైతు సత్యాగ్రహ యాత్ర'

వలస పాలకుల నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చే క్రమంలో నాడు మహాత్మాగాంధీ ఉప్పు సత్యాగ్రహ యాత్ర చేస్తే, వివక్ష లేకుండా అందరికీ ఎదిగే అవకాశాలున్న భారతదేశం కోసం చేస్తున్న రెండో స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ నేడు స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య పతాకం మీద 'రైతు సత్యాగ్రహ యాత్ర' నిర్వహించారు. చట్టబద్ధంగా వ్యవహరించే కనీస నీతి ఉన్న తెల్లదొరల దురాగతాల మీద గాంధీ పోరాడితే, స్వదేశీ రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా తన ప్రజల మీదే కిరాతకంగా వ్యవహరిస్తున్న నల్లదొరల దాష్టీకానికి వ్యతిరేకంగా జేపీ సత్యాగ్రహ యాత్ర చేశారు.



ఉప్పు సత్యాగ్రహంలో భాగంగా శాసనోల్లంఘన చేసి ఉప్పు తయారు చేస్తున్న బాపూ (1930)



రైతు సత్యాగ్రహంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చట్టవిరుద్ధ ఆంక్షల్ని ఉల్లంఘించి, వేరే రాష్ట్రానికి బియ్యం తీసుకెళ్లి వేలం వేసి అమ్ముతున్న జేపీ (2012)

తమ పంటలను ఎక్కడైనా అమ్ముకుని లాభాల్ని ఆర్జించే స్వేచ్ఛ లేకుండా రైతులకు స్వదేశీ పాలకులు వేసిన సంకెళ్లను తెంచేందుకు తాను సంకెళ్లు వేసుకుని వదవిని వదులుకోవటానికి, జైలుకెళ్లటానికి కూడా సిద్ధమని ప్రకటించి జేపీ ఒక సంకేతంగా రైతు సత్యాగ్రహ యాత్ర చేశారు. లోక్‌సత్తా, స్వతంత్ర రైతు సంఘాల పోరాటంతో కేంద్రప్రభుత్వం ధాన్యం ఎగుమతులను సూత్రప్రాయంగా అనుమతించిందని, పొరుగు రాష్ట్రాలకు కూడా ధాన్యం అమ్మకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంక్షలు విధించటం అన్యాయమని, రైతు వ్యతిరేక చర్య అని, ఆ ఆంక్షల్ని ప్రభుత్వమే ఎత్తివేయకపోతే తాను సన్నరకం ధాన్యం, బియ్యం మూటల్ని భుజాల మీద తీసుకెళ్లి పక్క రాష్ట్రాలలో అమ్ముతానని ఫిబ్రవరి 2నే జేపీ ముఖ్యమంత్రికి లేఖ రాసి హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ఫిబ్రవరి 18న కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి రైతులతో కలిసి జేపీ రైతు సత్యాగ్రహ యాత్రను ప్రారంభించారు. మంత్రాలయం మీదగా మరుసటిరోజు కర్ణాటక సరిహద్దుకు చేరుకుని రాష్ట్రప్రభుత్వ ఆంక్షల్ని తుంగభద్రలో తొక్కి బియ్యాన్ని గిల్సాసూగుర్ క్యాంప్‌లో అమ్మారు.

**1930లో దండి వద్ద ఉప్పు చట్టాన్ని ఒక సంకేతంగా గాంధీ ధిక్కరించి దోసెడు ఉప్పును తీసుకుని దాన్ని రూ.1,600 రూపాయలకు అమ్మారు. బంగారం రేట్ల ప్రకారం ఇప్పుడు ఆ డబ్బు రూ.1.6 కోట్లు ఉంటుందని అంచనా. అదేతీరుగా తాను ఆంధ్రప్రదేశ్ నుంచి వెంట తీసుకెళ్లిన బియ్యాన్ని జేపీ కర్ణాటకలో వేలంపాట పెట్టి రూ.1 లక్షకు అమ్మారు. భారతదేశం మొత్తం ఒకే మార్కెట్ అని, రైతులు ఏ రాష్ట్రంలోనైనా తమ ఉత్పత్తులను అమ్ముకోవటానికి ఆంక్షలు లేవని చాటి చెప్పేందుకు జేపీ బియ్యాన్ని కర్ణాటకలో అమ్మిన ఫిబ్రవరి 19, 2012 ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక ప్రశస్తమైన రోజుగా నిలిచిపోతుంది. అలాగే రైతు స్వతంత్ర పోరాటం కోసం చేసిన ఈ సత్యాగ్రహం భారతదేశంలో పాలనా, ఆర్థిక సంస్కరణలకు, రాజకీయ ప్రక్షాళనకు సాగుతున్న దీర్ఘకాలిక పోరాటంలో ఒక మైలురాయిగా నిలుస్తుందనటంలో సందేహం లేదు.** ఆ తర్వాత ఫిబ్రవరి 25న నిజామాబాద్ జిల్లా పోచారం నుంచి బయల్దేరి మహారాష్ట్రలోని ఏస్గీ వద్ద బియ్యాన్ని అమ్మటం, తర్వాత ఆ అంశం మీద ఫిబ్రవరి 28న అసెంబ్లీలో జరిగిన చర్చలో కేంద్రప్రభుత్వ చట్టనిబంధనలకు విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా ధాన్యం ఉత్పత్తుల మీద ఆంక్షల్ని విధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర రైతుల్ని ఎలా నడ్డివిరుస్తోందీ జేపీ నిర్దిష్టంగా సభలో వివరిస్తూ ప్రభుత్వ తీరును ఎండగట్టటం, ప్రభుత్వం తడబడి ఆంక్షలు లేవని ఒకసారి, అనధికార ఆంక్షలని ఇంకోసారి, ప్రతిపక్షాలు కోరితే ఆంక్షల్ని ఎత్తివేస్తామని మరోసారి పౌరసరఫరాల శాఖామంత్రి, ముఖ్యమంత్రి పరస్పర విరుద్ధ ప్రకటనలు చేసి సవాలును దాటవేసే ప్రయత్నం చేయటం తెలిసిందే. ధాన్యంతో మొదలుపెట్టి అన్ని పంటలకూ ఈ ఉద్యమాన్ని విస్తరిస్తామని, పారిశ్రామికరంగంలాగే వ్యవసాయాన్ని కూడా సర్కారీ ఆంక్షల నుంచి విముక్తి చేసేంతవరకూ, దాంతోపాటు వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు రిటైల్ ఛైన్లు ఏర్పాటు, గోదాములు, కోల్డ్‌స్టోరేజీల నిర్మాణం, ప్లెడ్జి లోన్లు ఇప్పించటం, మార్కెట్ యార్డుల ఆధునీకరణ, రైతులకు సలహాసహాయాలకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అగ్రి క్లినిక్‌ల ఏర్పాటు సహా ఒక్కో పంటకూ ఒక్కో విధానంలో అన్నిరకాల మౌలిక మార్పుల్ని సాధించేంత వరకూ విశ్రమించబోమని జేపీ తన యాత్రలో పునరుద్ఘాటించారు. తొలిసారిగా మీడియా కూడా జేపీ రైతు సత్యాగ్రహ యాత్రకు గణనీయ ప్రాచుర్యం కల్పించింది. **అయితే క్షేత్రస్థాయిలో రైతులు, వివిధ వర్గాల ప్రజలు ఈ రైతు సత్యాగ్రహ యాత్ర గురించి ఏమనుకుంటున్నారో ఒక పరిమిత శ్యాంపిల్ సర్వేలాగా తెలుసుకునే అవకాశం నాకు లభించింది. వ్యవస్థలో మేలిమార్పు కోరుకుంటున్నవారందరితో ఆ వివరాలను పంచుకునే ప్రయత్నమే ఈ వ్యాసం...**

ఫిబ్రవరి చివరి వారంలో ఒక వ్యక్తిగత కార్యక్రమంలో పాల్గొనేందుకు నేను గుంటూరు జిల్లా తెనాలి వెళ్లాను. వృత్తిరీత్యా లోక్‌సత్తా పార్టీ భావజాలాన్ని, కార్యక్రమాల్ని దగ్గరగా పరిశీలించే అవకాశమున్న వ్యక్తిని కావటంతో ఆ కార్యక్రమానికి వచ్చినవారిలో పలువురు నావద్ద రాజకీయ పరిణామాలు, నేతల తీరు గురించే ఎక్కువగా మాట్లాడారు. జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర వారందరి మీదా చాలా పెద్దఎత్తున ప్రభావం చూపిందని నాకర్థమైంది. లోక్‌సత్తా వల్ల మరోపార్టీకి నష్టం జరిగిందని, లోక్‌సత్తాకు ఓటు వేస్తే వేస్టవుతుందని గతంలో వాదించినవారు కూడా ఈసారి ఓ మంచి మార్పు లోక్‌సత్తా ద్వారా మాత్రమే సాధ్యం, లోక్‌సత్తాకు మద్దతివ్వాల్సి ఉంది అనే రీతిలో మాట్లాడారు.

తెనాలి నియోజకవర్గానికి రాష్ట్ర శాసనసభ స్పీకర్ నాదెండ్ల మనోహర్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తెనాలి నగరంలోని స్వరాజ్ సినిమా థియేటర్ వద్ద దాదాపు రూ. 40 కోట్ల విలువైన స్థలాన్ని నాదెండ్ల మనోహర్ కేవలం అందులో పదోవంతు ధరకే కొట్టేశాడట గదా, జనమంతా అనుకుంటున్నారు అని ఒకాయన చర్చ మొదలుపెట్టాడు. 'నాకు వాస్తవాలు తెలియవు. అయినా డబ్బులు వెదజల్లకుండా రాజకీయం చేయలేని పార్టీలు ఎన్నికయ్యాక ప్రజల డబ్బును దోచుకోవటం వింత, కొత్త కాదు గదా' అన్నాను. ఈలోగా రైతు ఉద్యమాల నేత ఎన్‌జీ రంగా గారితో కాస్త సాన్నిహిత్యం కలిగివున్న ఒక పెద్దాయన వచ్చారు. జేపీ ఈవేళ చెబుతున్నట్టు రైతులు తమ ఉత్పత్తుల్ని తమకు నచ్చినరేట్లకు, తమకు నచ్చిన చోట అమ్ముకునేలా చేయాలని, వ్యవసాయాన్ని లాభసాటి చేయాలని అప్పట్లో ఎన్‌జీరంగా ఎంతో కష్టపడ్డారని, కానీ ఆ లక్ష్యాన్ని సాధించలేకపోయారని చెప్పారు. జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర రైతులకు గొప్ప శక్తిని అందించిందని, వారిలో కొత్త ఆశల్ని, ధైర్యాన్ని కలిగించిందని అన్నారు. అసెంబ్లీలో సరకున్న నిఖార్సయిన నాయకుడు జేపీ ఒక్కడే, కానీ ఆయన చెబుతున్న విషయాలు జరగటానికి ఇంకా చాలా కాలం పడుతుంది అని నిరాశనిస్పృహల్ని వ్యక్తంచేశారు. తమ ఊరు సహా చాలా గ్రామాలలో కులాల కుంపట్లు రగులుతున్నాయని, అందరి ప్రయోజనాలనూ కాపాడుతూ అందరినీ క్రమశిక్షణతో నడిపించే నైతిక శక్తిగల నాయకులు గ్రామీణ ప్రాంతాలలో కరవవుతున్నారని నిట్టూర్చారు. కాస్త అవగాహన ఉన్నవాళ్లు పట్టణాలకు వలసపోకుండా ఉంటే గ్రామాలలో కొంత మంచి మార్పు రావచ్చన్నారు. ప్రస్తుత కలుషిత వాతావరణంలో లోక్‌సత్తా చెప్పే మంచి అందరినీ ఆకర్షిస్తున్నా ఓట్లు పడతాయా అని సందేహం వ్యక్తం చేశారు. ఉచితాలు, డబ్బు, మద్యం, ప్రలోభాలు ఇస్తుంటే మీరు చెప్పే మంచి జనానికి ఓట్లు వేసే స్థాయిలో ఎలా ఎక్కుతుంది అని ప్రశ్నించారు. పేదరికం ఇప్పట్లో పోవటం కష్టం అని పెదవి విరిచారు. 'మంచి చదువు, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు ఇస్తే ఎందుకు పోదు? తమ పిల్లల భవిష్యత్తు కోసం ఆరాటపడుతున్న ప్రజలు వీటిని ఉచితంగా ఇవ్వాలని ఎందుకడగరు?' అన్నాను. సాలోచనగా చూశారు. నమ్మకం, అపనమ్మకం మధ్య ఊగిసలాటలో కన్పించారాయన.

తర్వాత చిత్తూరు జిల్లా పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కొంతమంది రైతులు వచ్చారు. వారిలో ఒక మహిళారైతు జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర గురించి ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. ఇప్పటిదాకా తాము చంద్రబాబుకు ఓట్లు వేస్తున్నామని, చిత్తూరులో రైతుల్ని, పాలడెయిరీని నాశనం చేసిన చంద్రబాబును ఈసారి కాలర్ పట్టుకుంటామని ఆవేశంగా చెప్పారామె. మరోరైతు మాత్రం జగన్ కంటే చంద్రబాబు ఎక్కువ అవినీతిపరుడా? ఎందుకు జగన్‌కు ఓట్లు వేయాలి? చంద్రబాబును ఈసారి గెలిపించకపోతే మనకి నష్టం అంటూ చర్చను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు. జేపీని, చంద్రబాబును పోల్చకుండా ఆయన చాలా జాగ్రత్త పడ్డారు. ఆయన పెద్దగా చదువుకోకపోయినా, 2జీ స్పెక్ట్రం లైసెన్సుల్ని రద్దుచేయాలని సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది, రైతుల ఉత్పత్తుల అమ్మకాల మీద ఆంక్షలు లేకుండా లాభసాటి రేటు వచ్చే ఏర్పాట్లు ఉండాలని చిత్తశుద్ధితో పోరాడుతున్నది జేపీ మాత్రమేనని చెప్పారు. నైతికతే బలంగా నిలబడ్డ సిసలైన నాయకుడు అని జేపీకి కితాబిచ్చారు. ఆ రైతు భార్య ఒక టీచర్. ఊరిలో జనాన్ని పోగేయగల శక్తి ఉంది. మహిళా సంఘాలలో భాగస్వామిగా ఉంటూ మంచి పట్టు సంపాదించారామె. జగన్ పార్టీవాళ్లు తమకు గాలం వేస్తున్నారని, డబ్బులు, ఎన్నికలలో సీట్లు ఆఫర్ చేస్తున్నారని, అవకాశం ఉంటే లోక్‌సత్తాలాంటి మంచి పార్టీ ద్వారా సేవ చేయాలని ఉందని చెప్పారామె.

ఈలోగా ఒంగోలులో రెండు మద్యం దుకాణాలలో వాటాలు కలిగిన ఒక వ్యక్తి రావటంతో మద్యం సిండికేట్లు, అవినీతి గురించి చర్చ వచ్చింది. ఏసీబీని ప్రభుత్వాలు గుప్పెట్లో పెట్టుకుంటున్నాయి తమ మీద అక్రమ కేసులు పెట్టారని ఆరోపణలు చేయటం తప్ప ఏసీబీకి స్వయంప్రతిపత్తి

> **వారిలో ఒక మహిళారైతు జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర గురించి ఎంతో ఉద్వేగంగా మాట్లాడారు. ఇప్పటిదాకా తాము చంద్రబాబుకు ఓట్లు వేస్తున్నామని, చిత్తూరులో రైతుల్ని, పాలడెయిరీని నాశనం చేసిన చంద్రబాబును ఈసారి కాలర్ పట్టుకుంటామని ఆవేశంగా చెప్పారామె.**

కల్పించాలని, అవినీతిపరుల భరతం పట్టేలా లోకాయుక్తను బలోపేతం చేయాలని చంద్రబాబు, జగన్, ఇతర పార్టీల నేతలు ఎందుకు అడగటం లేదు అని ప్రశ్నించాను. నిజమే గదా అన్నారు అక్కడున్నవారంతా. రాష్ట్రంలో బలమైన లోకాయుక్త కోసం లోక్‌సత్తా బిల్లును తయారు చేసి అసెంబ్లీలోని అన్ని పార్టీలకూ ఇస్తే అధికార, ప్రతిపక్షమైన కాంగ్రెస్, తెలుగుదేశం ఆ బిల్లు ఆమోదానికి ముందుకు రావటంలేదని, ఇక్కడ అన్నా హజారే ఉద్యమానికి మద్దతు పలికిన టీడీపీ పార్లమెంటులో మాత్రం బలమైన లోకాయుక్త ఏర్పాటుకు వ్యతిరేకంగా ఓటు వేసిందని అన్నాను. తెలంగాణపై అసెంబ్లీలో చర్చించి ఒక హేతుబద్ధ పరిష్కారం సాధిద్దామని లోక్‌సత్తా కోరుతున్నా, ఆ సమస్య మీద చర్చించే ధైర్యం కూడా లేని ఆ పార్టీల నేతలా నాయకులు? అని ప్రశ్నించాను... నిశ్శబ్దం. అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేసే చట్టం రావాలి అన్నాను. వాళ్ల పదవులు కూడా పోవాలి అని ఇంకొకాయన నేను మర్చిపోయిన పాయింట్‌ను గుర్తుచేశారు. లోక్‌సత్తా భావజాలాన్ని, విధానాల్ని ప్రజలు ఎంతగా ఫాలో అవుతున్నారో నాకర్థమైంది.

**'నిర్వివాదాంశంగా జేపీ గొప్ప నాయకుడు. కానీ జగన్‌కి జేపీ కంటే ఎక్కువ జనం వస్తున్నారు. వాళ్లిద్దరి మధ్య నక్కకి, నాగలోకానికి మధ్య ఉన్న తేడా ఉంది. ఇలాంటి వాతావరణంలో డబ్బు లేకుండా ఎలా గెలుస్తుంది లోక్‌సత్తా' అని ప్రశ్నించారు. సరైన విధానాలతో, నిజాయతీగా నిలబడి అవసరమైన డబ్బును ప్రజల నుంచే చట్టబద్ధంగా తీసుకుని గెలవటమే అసలైన నాయకత్వం అన్నాను.**

ఆ తర్వాత భోజనాల సమయంలో ఒక బడా వ్యాపారవేత్త తారసపడ్డారు. విజయవాడలో టీడీపీకి అండగా నిలిచే వ్యక్తి ఆయన. గతంలో లోక్‌సత్తా పట్ల పెద్ద సుముఖంగా మాట్లాడలేదుగానీ, ఈసారి మాత్రం చాలా అడ్మయిరింగ్‌గా మాట్లాడారు. 'ఏంటీ, జేపీ ప్రచారం కోరుకుంటున్నట్టున్నాడు' అని ప్రశ్నించారు. తనకికాదు, తాను చెప్పే మాటల్ని ప్రజలలోకి తీసుకెళ్లటానికి జేపీ ప్రచారం కోరుకుంటున్నారు అన్నాను. చంద్రబాబు, జగన్ మొదలుపెట్టిన తర్వాత జేపీ రైతు బాట పట్టినట్లుంది, కాస్త ఆలస్యమైందేమో అని మరో సందేహం వ్యక్తం చేశారాయన. 'కాదు, వినూత్న విధానాలతో, పంథాలో జేపీ మొదలుపెట్టాకే వాళ్లు హడావుడిగా మొదలుపెట్టారు. ఏడాదిన్నరకు పైగా లోక్‌సత్తా చేస్తున్న రైతు ఉద్యమాలకు కొనసాగింపుగా చేయబట్టే ఇప్పుడు రైతు సత్యాగ్రహ యాత్ర అంత సూటిగా ప్రజల్లోకి వెళ్లింది' అన్నాను. ఓహో ఇప్పటిదాకా లోక్‌సత్తా చేసిన రైతు కార్యక్రమాలకు అంతగా మీడియా కవరేజీ లేదన్నమాట అన్నారు. 'నిర్వివాదాంశంగా జేపీ గొప్ప నాయకుడు. కానీ జగన్‌కి జేపీ కంటే ఎక్కువ జనం వస్తున్నారు. వాళ్లిద్దరి మధ్య నక్కకి, నాగలోకానికి మధ్య ఉన్న తేడా ఉంది. ఇలాంటి వాతావరణంలో డబ్బు లేకుండా ఎలా గెలుస్తుంది లోక్‌సత్తా' అని ప్రశ్నించారు. సరైన విధానాలతో, నిజాయతీగా నిలబడి అవసరమైన డబ్బును ప్రజల నుంచే చట్టబద్ధంగా తీసుకుని గెలవటమే అసలైన నాయకత్వం అన్నాను. 'కొన్నేళ్లుగా నేను లోక్‌సత్తాను దగ్గరగా చూస్తున్నాను. భారతదేశ విముక్తికి ఆ భావజాలం, విధానాలు, ప్రత్యామ్నాయ రాజకీయం తప్ప వేరే మార్గం లేదు. లోక్‌సత్తా అంత క్లారిటీతో, ఆచరణ సాధ్యంగా సమాజానికి ఉత్తమ రాజకీయాన్ని అందించిన పార్టీ నాకు తెలిసి ప్రపంచంలో ఇంత వరకూ రాలేదు. వీలునుబట్టి ఎవరెంత సమయం కేటాయించ గలిగినా, లోక్‌సత్తా పార్టీ కోసం పనిచేయటాన్ని మించిన ఉత్తమ కార్యం జీవితంలో ఇంకోటి లేదు. నూటికినూరు శాతం నిజాయతీగా చెబుతున్న మాటలివి' అన్నాను. తలూపాడాయన.

ఆ తర్వాత ఒక లంపేన్ మిత్రుడు కన్పించాడు. ఎప్పుడూ పేపర్లు కూడా సీరియస్‌గా చదవడతను. 'ఏంటీ, జేపీ రైతు బాట పట్టాడు?' అన్నాడు. 'మంచి రేటు వస్తున్నా కూడా రైతులు తమ పంటల్ని జిల్లా, రాష్ట్రం దాటి అమ్ముకోకూడదని కాంగ్రెస్, టీడీపీ అన్ని పార్టీలూ ఇన్నాళ్లూ మోసం చేస్తున్నాయి. ఆ ప్రభుత్వాలు వేసిన సంకెళ్లను తెంచేందుకే జేపీ సత్యాగ్రహ యాత్ర చేశారు. ఎవరికీ లేని ఆంక్షలు రైతులకేనా? వాళ్లు గొర్రెలా?' అన్నాను. కరెక్టే అన్నాడు. కూకట్‌పల్లి నుంచి ఒకాయన వచ్చారు. రైతులపై విధించిన ఆంక్షల్ని ప్రభుత్వం తొలగిస్తే అది లోక్‌సత్తాకు పెద్ద విజయమే అన్నారాయన. అలాగే ఒక రిక్షాపుల్లర్, ట్యాక్సీ డ్రైవర్‌తో కూడా మాట్లాడే అవకాశం వచ్చింది. ఎవరూ చేయలేని ఏదో ఒక మంచిపని జేపీ చేశారని మాత్రం వారికి అర్థమైంది.

మెజారిటీ ప్రజలకు సంబంధించిన ఒక మౌలిక అంశం మీద మామూలు నినాదాలతో కాకుండా నిర్దిష్ట విధానాలతో పోరాటం చేయటంతోపాటు రైతు సత్యాగ్రహ యాత్ర పోరాటపంథా కూడా అన్ని వర్గాల ప్రజలనూ ఆకట్టుకుందని నాకర్థమైంది. 'లక్ష్యం–పోరాటపంథా–నైతిక నాయకత్వం' కలిసి రైతు సత్యాగ్రహ యాత్రను గొప్ప ప్రభావశీల పోరాటంగా మార్చాయి. నాడు గాంధీ చేసిన ఉప్పు సత్యాగ్రహ యాత్రలాగా నేడు జేపీ రైతు సత్యాగ్రహ యాత్ర నిజమైన సహాయనిరాకరణ అంటే ఏమిటో, నైతిక శక్తికున్న బలం ఏమిటో ప్రజలకు చూపింది. రాజ్యాంగాన్ని సరిగా అర్థంచేసుకుని పాటిస్తే ఒక శక్తివంతమైన పోరాట ఆయుధంగా ఎలా ఉపయోగపడుతుందో ప్రజలకు జేపీ చూపారు. స్వాతంత్ర్యం వచ్చాక ప్రభుత్వాల అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడటానికి సరైన ఆందోళనా పద్ధతులు లేక రాజకీయ పార్టీలు బంద్‌లు, రాస్తారోకోలు, హింసాత్మక దాడులకు పాల్పడుతూ ప్రజలనే ఇబ్బంది పెడుతుంటే, వాటిని చూసీచూసీ విసిగిపోయిన ప్రజలను రైతు సత్యాగ్రహ యాత్ర ఎంతగానో ఆకట్టుకుంది. ఇదీ 21వ శతాబ్దపు రాజకీయం అనిపించేలా వారిని కదిలిం చింది. అమాయకప్రజలను రక్షించే భారాన్ని మోస్తాను అనటానికి సంకేతంగా భుజాల మీద గొర్రెపిల్లను మోసిన జీసస్ క్రీస్తును, ధర్మపథాన్ని వీడకుండా దుష్టవ్యవస్థల మీద పోరాడిన బుద్ధుడిని, నైతికతే ఆయుధంగా స్వతంత్ర పోరాటం చేసిన గాంధీని స్ఫురణకు తెస్తూ జేపీ చేసిన రైతు సత్యాగ్రహ యాత్ర ప్రజలలో ఒక ముద్రలా పడిపోయింది. తాను పండించిన ఉత్పత్తికి రైతుకు రూ.35 ఆదాయం వస్తుంటే, ఆ ఉత్పత్తిని కొంటున్న వినియోగదారులకు రూ.100 పడుతోందని, అవినీతి సొమ్ము కోసం ప్రభుత్వం పెంచిపోషిస్తున్న మధ్య దళారీ వ్యవస్థ వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని జేపీ లేవనెత్తిన వాదన పట్టణ ప్రాంత వినియోగదారులలో కూడా రైతుల పట్ల సానుభూతిని పెంచింది. రైతు సత్యాగ్రహ యాత్ర పట్ల స్పందింపచేసింది. పనిగట్టుకుని విమర్శించాలనుకునేవారు తప్ప ప్రతి ఒక్కరూ జేపీ యాత్రను మనస్ఫూర్తిగా ఆహ్వానించి మద్దతు పలుకుతున్నారు.

***'టీడీపీకే కాదు, కాంగ్రెస్‌కు, రాష్ట్రంలో, దేశంలో ఇప్పుడున్న రాజకీయవ్యవస్థకు లోక్‌సత్తా ప్రత్యామ్నాయం. టీడీపీ, కాంగ్రెస్ పేర్లు వేరే తప్ప ఒకే తరహా పార్టీలు' అనే వాస్తవాల్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. అలాగే గ్రామాలలో కులాల చిచ్చు, వ్యవసాయ సంక్షోభం బద్దలవటానికి సిద్ధంగా ఉన్నాయి. వీటికి నిర్దిష్టమైన పరిష్కారాన్ని అందించి పరిష్కరించగల విధానాలు, రాజకీయ సంస్కృతి లోక్‌సత్తా పార్టీకి మాత్రమే ఉన్నాయి.***

అలాగే తాత్కాలిక అంశాల్ని, తక్షణ స్పందనల్ని పక్కనపెడితే... అన్ని ప్రాంతాలలో లోక్‌సత్తాకు ఒకే తరహా ఆదరణ ఉందనిపించింది. అయితే పార్టీకి ఆదరణ ఇంతగా పెరుగుతున్నా, అది ఓటుగా మారాలంటే ఇంకా గట్టి కృషి జరగాలి. ప్రజలలో ఇంకా గందరగోళం తొలగాలి, విద్యార్థులు, యువతలో ఇంకా అవగాహన పెరగాలి. మారుమూల ప్రాంతాలకు ఇంకా గట్టిగా చేరాలి. అలాగే టీడీపీకి ప్రత్యామ్నాయం లోక్‌సత్తా అనే భావన చాలా ఎక్కువగా ఉంది. 'టీడీపీకే కాదు, కాంగ్రెస్‌కు, రాష్ట్రంలో, దేశంలో ఇప్పుడున్న రాజకీయవ్యవస్థకు లోక్‌సత్తా ప్రత్యామ్నాయం. టీడీపీ, కాంగ్రెస్ పేర్లు వేరే తప్ప ఒకే తరహా పార్టీలు' అనే వాస్తవాల్ని ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. అలాగే గ్రామాలలో కులాల చిచ్చు, వ్యవసాయ సంక్షోభం బద్దలవటానికి సిద్ధంగా ఉన్నాయి. వీటికి నిర్దిష్టమైన పరిష్కారాన్ని అందించి పరిష్కరించగల విధానాలు, రాజకీయ సంస్కృతి లోక్‌సత్తా పార్టీకి మాత్రమే ఉన్నాయి. చెప్పేమాటలకు, చేసే పనులకు పొంతనతో 'సంకల్పం, మేధస్సు, ప్రజల పట్ల ప్రేమ'తో కొత్త రాజకీయానికి ప్రతీకగా నిలవగలిగే, ఎన్నికల వ్యవస్థకు తగినరీతిలో నిలకడగా క్రమశిక్షణతో పనిచేసే నాయకులు స్థానికంగా ఎక్కడికక్కడ లోక్‌సత్తాకు కావాలి. మౌలిక లక్ష్యాల్ని ఎన్నడూ విస్మరించే అవకాశం లేనిరీతిలో సంస్థాగత నిర్మాణాన్ని పార్టీకి ఏర్పరుచుకోవాలి. ఈ తీరుగా వాస్తవిక కార్యాచరణతో ముందుకెళ్తే లోక్‌సత్తా పార్టీకి అధికారం, తద్వారా ఈ రాష్ట్రానికి, భారతదేశానికి ఉజ్వల భవిత తథ్యం. ◆

**– 21వ శతాబ్దపు భారతీయుడు**

# పంటల అమ్మకాలపై ఆంక్షలు రాజ్యాంగ విరుద్ధం

-డి. వెంకటేశ్వరరావు
(జాయింట్ కమిషనర్ (రిటైర్డ్), వాణిజ్య పన్నుల శాఖ)

ధాన్యం, బియ్యం అంతరాష్ట్ర రవాణాపై ఆంక్షలను నిరసిస్తూ రాష్ట్రంలో విపక్షాలు చేసిన విమర్శలు, నిర్వహించిన ఆందోళన ప్రదర్శనలు సర్వత్రా ఆసక్తిరేపాయి. లోక్‌సత్తా పార్టీ అధినేత స్వయంగా కొంత బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటించి ఇతర రాష్ట్రాల్లో విక్రయించిన వైనం ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఇదే అంశంపై ఫిబ్రవరి 28న రాష్ట్ర శాసనసభలో వాడి-వేడి చర్చ జరిగింది. చర్చకు సమాధానమిస్తూ ముఖ్యమంత్రి-ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు ఆంక్షలు కావని, అవి కేవలం లాంఛనప్రాయ ఉత్తర్వులేనవి వాటివల్ల రాష్ట్రంలో బియ్యం ధరలు అదుపులో ఉండి వినియోగదారులకు మేలు జరుగుతుందని సెలవిచ్చారు. ఉత్తర్వులను ఉపసంహరించుకొనేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరమూ లేదని- కానీ ఆ తరవాత రాష్ట్రంలో బియ్యం ధరలు పెరిగితే ప్రభుత్వాన్ని తప్పు పట్టకూడదనీ ప్రకటించారు. రైతుల ప్రయోజనాలు, వినియోగదారుల ప్రయోజనాలు వేర్వేరని చెప్పడం ముఖ్యమంత్రి సమాధాన సారాంశం. ఒకరి ప్రయోజనాలు కాపాడాలంటే మరొకరి ప్రయోజనాలను తప్పనిసరిగా బలిపెట్టాల్సిందేనా! అందరి ప్రయోజనాలు, సంక్షేమాలను కాపాడి, అందుకు తగిన మార్గాలను అన్వేషించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? సర్కారు తన బాధ్యతలను తప్పించుకుని ఎన్నాళ్లు తిరుగుతుంది?

## పరిధిదాటిన ప్రభుత్వం

ప్రభుత్వం ఆంక్షలను వినియోగదారులకు తక్కువ ధరలకు బియ్యం లభిస్తాయా అన్న విషయాన్ని పక్కనబెడితే రాష్ట్ర ప్రభుత్వానికి అటువంటి ఆంక్షలు విధించే అధికారం ఉందా అన్న విషయాన్ని తొలుత పరిశీలించాలి. దేశంలో ఎక్కడనుంచి ఎక్కడికైనా సరకులు రవాణా చేసుకునే హక్కు రాజ్యాంగంలోని 301 అధికరణం ప్రకారం వ్యాపారులు, రైతులతో సహా



అందరికీ కల్పించారు. దేశ సమగ్రతకు సంబంధించి అత్యంత కీలకమైన, విలువైన హక్కు ఇది. అవసరమైతే పన్నులు విధించుకోవచ్చుగాని- అసలు రవాణా చేయడానికే వీలులేదు అనే ఆంక్షలుగాని లాంఛనప్రాయ ఉత్తర్వులుగాని ఇచ్చే అధికారం సాధారణంగా ప్రభుత్వాలకు ఉండదు. పన్నుల విధింపునకు రాజ్యాంగం కొన్ని పరిమితులు నిర్దేశించింది. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే వస్తువులకు, ఇతర రాష్ట్రాలనుంచి దిగుమతి అయ్యే వస్తువులకు మధ్య వ్యత్యాసం చూపేవిగా ఆ పన్నులు ఉండరాదు. ఈ సూత్రం ఆధారంగా సుప్రీంకోర్టు జిందాల్ స్టీల్స్ కేసులో వెలువరించిన తీర్పును అనుసరించి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రాయలసీమ అల్కలీస్ కేసులో రాష్ట్రంలో అమల్లో ఉన్న ప్రవేశపన్ను చట్టం- 2002 (ఎంట్రీట్యాక్స్ యాక్ట్-2002)ను రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. ప్రజాహితం కోసం అంతరాష్ట్ర రవాణాపై ఆంక్షలు విధించే అధికారం ఆర్టికల్-302 కింద కేంద్రానికి, రాష్ట్రంలో ఆంక్షలు విధించే అధికారం ఆర్టికల్-304 కింద రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించింది. ఈ ఆంక్షలన్నీ చట్టప్రకారమే అమలు జరగాలి కానీ, ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా మాత్రం కాదు. చట్టాలోనూ సహేతుక కారణాలు చూపాలి. ఆ కారణాలు సహేతుకమైనవా కావా అన్న విషయాన్ని న్యాయస్థానాలు పరిశీలించవచ్చు. లాంఛనప్రాయమని ప్రభుత్వం చెబుతున్న ఉత్తర్వులను రైతు సంఘాలుగానీ, ఇతరులుగానీ ఇప్పటివరకూ కోర్టుల్లో ప్రశ్నించకపోవడమే ఆశ్చర్యకరం. పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లభించక రైతులు కొన్ని చోట్ల పంట విరామం ప్రకటిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో అన్నదాతలు ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వినియోగదారుల ప్రయోజనాల పేరిట అంతరాష్ట్ర రావాణాపై ఆంక్షలు విధించడం సరికాదు. ఏ రైతూ అన్ని పంటలు పండించడు. తాను పండించే ఒకటి రెండు పంటలు తప్ప మిగిలిన అన్ని వ్యవసాయోత్పత్తులతో సహా వివిధ రకాల వస్తువులకు రైతు సైతం ఓ వినియోగదారుడే. రైతుల ప్రయోజనాలకు, వినియోగదారుల ప్రయోజనాలకు తప్పనిసరిగా వైరుధ్యం ఉండాల్సిన పనిలేదు. ధరల స్థిరీకరణలో తన బాధ్యతను విస్మరించే క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం వైరుధ్యాల ప్రసక్తి లేవనెత్తుతోందన్నది స్పష్టం. రైతుల ప్రయోజనాలను, వినియోగదారుల ప్రయోజనాలను రెండింటినీ కాపాడే మార్గాలకోసం అన్వేషించాల్సి ఉంది.

రైతుల కోణం ఆలోచిస్తే-ధాన్యం, బియ్యం అంతరాష్ట్ర స్థాయిలో రవాణా చేయడానికి ముఖ్య కారణం మంచి ధర లభిస్తుందన్న నమ్మకమే. తన పంటపై మంచి ధర పొందే హక్కు రైతుకు ఉంది. ప్రభుత్వం ఏటా ధాన్యానికి ప్రకటిస్తున్న మద్దతు ధరలవల్ల రైతులకు ఏ మాత్రం గిట్టుబాటు కావడం లేదు. 2011-12లో గ్రేడ్-ఎ ధాన్యం క్వింటాలుకు రూ॥1,110, మామూలు ధాన్యం క్వింటాలుకు రూ॥1,080 మద్దతు ధరగా ప్రకటించారు. రైతు ధాన్యాన్ని పండించేందుకు చేసే ఖర్చుతో పోలిస్తే ఆ ధరలు బాగా తక్కువ. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు, కూలీ ఖర్చులు, శ్రమను లెక్కించి- క్వింటాలు ధాన్యానికి రెండు వేల రూపాయల మద్దతు ధర ప్రకటిస్తేనే రైతుకు గిట్టుబాటవుతుందని వ్యవసాయ నిపుణుల చెబుతున్నారు. రైతు వెచ్చించే వ్యవసాయ ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర పెంచడం ప్రభుత్వానికి తలకు మించిన భారమైన పక్షంలో- రైతుల వ్యవసాయ ఖర్చులను తగ్గించే మార్గాలనైనా అన్వేషించాలి. ముఖ్యంగా రైతులు వ్యవసాయానికి అవసరమైన అన్ని ఉత్పాదకాలపై మోపుతున్న పన్నుల భారం గురించి ఆలోచించాలి. ఒక్క విత్తనాలు తప్ప మిగిలిన అన్ని ఉత్పాదకాలు, ఎరువులు, పురుగుమందులు, ట్రాక్టర్లు, ట్రెయిలర్లు, టైర్లు ట్యూబులు, యంత్రాలతో నడిచే వ్యవసాయ పనిముట్లు మొదలైన వాటన్నిటిమీద అయిదు శాతం వ్యాట్ విధిస్తున్నారు. కేవలం ఎరువులు, పురుగుమందులపైనే ఏటా రూ॥300కోట్ల పైచిలుకు వ్యాట్ భారం రైతుపై పడుతోంది. 'వ్యాట్' చట్టంలో కొనుగోళ్లపై చెల్లించిన పన్నుకు అమ్మకాలపై చెల్లించాల్సిన పన్నునుంచి పారిశ్రామికవేత్తలకు, వ్యాపారస్తులకు తగ్గింపు ఇస్తారు. కొనుగోళ్లపై చెల్లించిన పన్ను అధికంగా ఉంటే, దాన్ని వెనక్కివ్వడం (రిఫండ్) ద్వారా కూడా వారికి మేలు చేస్తున్నారు. అన్నదాతలకు అలాంటి సదుపాయాలు లేవు. రైతుల విక్రయాలమీద పన్ను విధించరు. అయితే, వ్యవసాయోత్పత్తులపై మాత్రం పన్ను విధిస్తారు- కానీ వ్యాపారస్తులు విక్రయించినప్పుడు మాత్రమే ఆ పన్ను వేయడం జరుగుతుంది. వ్యవసాయోత్పత్తులను పండించేటప్పుడు అయిన వ్యయంలో ఉత్పాదక పన్నులన్నీ మిళితమై ఉంటాయి. కాబట్టి ఆ వ్యవసాయ ఉత్పత్తులను వినియోగదారుడికి అమ్మినప్పుడు ఉత్పాదకాల మీద విధించిన పన్నూ, వ్యాపారస్థుడి విక్రయాలపై విధించే పన్నూ వినియోగారుడే చెల్లించాల్సి ఉంటుంది. వ్యవసాయానికి ఉపయోగించే అన్నింటిపైనా రైతులు పన్ను

భారాన్ని శాశ్వతంగా మోయాల్సిందే. తను పండించే పంటకు గిట్టుబాటు ధర వచ్చినా, రాకపోయినా వచ్చిన ధర తన పెట్టుబడి కంటే తక్కువైనా, ఏ విధమైన మినహాయింపు లేకుండా రైతులు పన్ను భారం భరించాల్సిందే. వ్యాట్ పరోక్ష పన్ను కావడంవల్ల పరోక్ష పన్నుల గురించి ప్రజలకు సరైన అవగాహనలేని కారణంవల్ల- తలబొప్పి కట్టే స్థాయిలో పన్ను చెల్లిస్తున్న విషయం రైతులకూ తెలియదు. వ్యాపారస్థులు రైతులకు విక్రయించే సమయంలోనైనా సరైన బిల్లులు ఇచ్చి ఆ బిల్లుల్లో ఈ పన్నుల గురించి స్పష్టంగా పేర్కొంటే రైతులకు ఈ విషయాలన్నీ తెలిసేవి. కానీ, రీటైల్ అమ్మకాల్లో బిల్లులు ఇవ్వడమే తక్కువ. ఇక పన్నుల గురించి చెప్పేదేముంది? నిజానికి వ్యాట్ చట్టంలోని సెక్షన్ 41, రూల్ 26 కింద ప్రతి వ్యాపారస్థుడు బిల్లులు తప్పనిసరిగా చెల్లించాలని, ఆ బిల్లుల్లో వ్యాట్ పన్నును ప్రత్యేకంగా చూపించాలని నిబంధనలు ఉన్నాయి. అమలుకు నోచుకోని అనేక నిబంధనల్లో ఇదొకటి. రైతులకు తెలిసినా తెలియకపోయినా వారు వందల కోట్ల రూపాయల పన్ను భారం కొనుగోళ్ల రూపంలో మోస్తున్నారన్నది నిర్వివాదం. రాష్ట్ర ప్రభుత్వం ఈ పన్నులను ఏదో రూపంలో రైతులకు తిరిగి ఇవ్వడమే లేదా వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల ఉత్పాదకాలపై వ్యాట్ ఎత్తివేయడమో చేస్తే రైతులకు కొంత భారం తగ్గుతుంది. రైతు పేరుపై ప్రభుత్వం ఎరువుల కర్మాగారాలకు ఇచ్చే సబ్సిడీవల్ల కర్మాగారాలకే తప్ప రైతులకు ప్రయోజనకారి కాదన్న విమర్శలనేపథ్యంలో కనీసం ఉత్పాదకాలపై వ్యాట్ పన్ను రద్దుచేస్తే రైతులకు వెసులుబాటు లభిస్తుంది. అటు ఉత్పాదకాల భారం తగ్గక, పండించిన పంటకు ఇచ్చే మద్దతు ధర గిట్టుబాటు కాకరైతులు తమ ధాన్యాన్ని ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్ళి విక్రయిస్తుంటే ఆంక్షలు విధించడం సరైన విధానం కాదు. రైతుల ముసుగులో దళారులు, వ్యాపారులే ధాన్యాన్ని, బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నారన్నది ప్రభుత్వ ఆరోపణ. ఆ తరహా రవాణాను అరికట్టడానికి మనకు చట్టాలు, వ్యవస్థలు ఉన్నాయి. ధాన్యం కావచ్చు లేదా ఎండు మిరపకాయలు, పసుపుకొమ్ములు, ముడిపత్తి వంటి వ్యవసాయోత్పత్తులు కావచ్చు. స్వయంగా రైతులే రవాణా చేస్తుంటే ఎం.ఆర్.ఓ. ఇచ్చిన రైతు ధృవీకరణ పత్రం ఉండాలి. ఆ పత్రం లేని పక్షంలో వారి వద్దనుంచి పన్ను వసూలు చేయాలన్న ఉత్తర్వులు వాణిజ్య పన్నుల శాఖనుంచి చెక్‌పోస్టులకు ఎంతోకాలం క్రితమే వెళ్ళాయి. రైతుల అమ్మకాలపై వ్యాట్ చట్టం పన్ను మినహాయింపు ఇచ్చింది. దళారులు, వ్యాపారులు మాత్రం పన్ను చెల్లించకుండా అంతరాష్ట్ర రవాణా చేయడానికి వీలులేదు. వాటిని పరిశీలించేందుకు చెక్‌పోస్టుల వ్యవస్థ ఉంది. ధృవీకరణ పత్రాలు దుర్వినియోగం కాకుండా జాగ్రత్తలు వహిస్తూ చెక్‌పోస్టుల పనితీరు మెరుగు పరిస్తే రైతుల పేరుతో దళారులు సరుకులు రవాణా చేయడాన్నీ అడ్డుకోవచ్చు కానీ దుర్వినియోగం అవుతుందని అసలు అంతరాష్ట్ర రవాణానే నిషేధిస్తే రైతులు నష్టపోతారు. వినియోగదారుల ప్రయోజనాలను పరిశీలిస్తే- బియ్యం ధరల స్థిరీకరణకు ప్రభుత్వ జోక్యమే మార్గం. ప్రభుత్వం ఇప్పటికే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కిలోబియ్యం రూపాయికే అమ్ముతోంది. కానీ, ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతోంది సన్నబియ్యం. ధాన్యం, సన్నబియ్యాన్నీ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా తక్కువ ధరకే ప్రభుత్వం వినియోగదారులకు సరఫరా చెయ్యవచ్చు. మన రాష్ట్రంలో ధాన్యం కంటే బియ్యాన్నే ప్రభుత్వం అధికంగా సేకరిస్తోంది. 2010-11లో 79,69,175 టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ ద్వారా సేకరిస్తే. 21,68,255 టన్నుల ధాన్యాన్ని మాత్రమే పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా సేకరించారు. ఇతర రాష్ట్రాల్లో ధాన్యసేకరణే అధికంగా జరుగుతోంది. 2010-11లో తమిళనాడులో 23,03,462 టన్నులు, పంజాబ్‌లో 1,0285,520 టన్నులు, ఛత్తీస్‌ఘడ్‌లో 51,15,760 టన్నులు, హర్యానాలో 16,54,753 టన్నుల ధాన్యం సేకరించారు. బియ్యానికి సంబంధించి తమిళనాడు, పంజాబ్‌లలో ఏ రకమైన సేకరణ జరగలేదు. ఛత్తీస్‌ఘడ్‌లో 3,18,397 టన్నులు, హర్యానాలో 24,233 టన్నుల బియ్యం సేకరణ మాత్రమే జరిగింది. మన రాష్ట్రంలో ధాన్యం కంటే బియ్యాన్ని ఎక్కువ సేకరించడానికిగల కారణాలు తెలియవు. సన్నరకం బియ్యానికి సంబంధించిన ధాన్యాన్ని పౌరసరఫరాల కార్పొరేషన్ వంటి ఏజెన్సీల ద్వారా ప్రభుత్వమే మార్కెట్ రేటుకు కొనుగోలు చేసి, మిల్లింగ్ చేయించి వచ్చిన బియ్యాన్ని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తే వినియోగదారులకు ప్రయోజనం కలుగుతుంది. అంతే కాకుండా రైతులు ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు తీసుకెళ్ళి విక్రయించుకోవాల్సిన పరిస్థితి తప్పుతుంది.

**ఇప్పటికైనా దిద్దుబాటు**

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వానికి బియ్యం మీద లభిస్తున్న పన్నులో

అధికభాగం మిల్లర్లు ఎఫ్.సి.ఐ.కి చేసే విక్రయాల ద్వారానే సమకూరుతోంది. 2010-11లో బియ్యం మీద రాష్ట్రానికి వచ్చిన వ్యాట్ ఆదాయం రూ॥520.93కోట్లు. రాష్ట్రంలో బహిరంగ మార్కెట్లో విక్రయించే బియ్యంపై వస్తున్న వ్యాట్ ఆదాయం అత్యల్పం. అలాంటి అమ్మకాలపై పన్ను ఎగవేత అత్యధికంగా ఉంటోంది. ఉదాహరణకు కోటికిపైగా జనాభా ఉన్న జంటనగరాల్లో బియ్యంమీద వసూలవుతున్న వ్యాట్ (ఎఫ్.సి.ఐ.మినహా) కేవలం రూ॥6.28కోట్లు మాత్రమే ఒక్కో మనిషి నెలకు సుమారు అయిదు కిలోల బియ్యం వినియోగించినా, సంవత్సరానికి 60కిలోల వినియోగం జరుగుతుంది. ఆ రకంగా-కోటి మందికి 60కోట్ల కిలోలు, ఇరవై రూపాయలకు కిలో చొప్పున రూ॥1200కోట్ల టర్నోవర్, దానిపై నాలుగు శాతం పన్ను చొప్పున ఇంచుమించుగా రూ॥50కోట్లు పన్ను వసూలు కావలసి ఉంది. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉంది. బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్న బియ్యంపై పన్ను ఎగవేత అత్యధికమని ప్రభుత్వానికీ, వాణిజ్య పన్నుల శాఖకీ బాగా తెలుసు. ఈ ఎగవేతను వాణిజ్య పన్నుల శాఖ అరికట్టలేకపోతోందనీ ప్రభుత్వానికి తెలుసు. మిల్లర్లు, వ్యాపారులు మాత్రం పన్నుతో సహా బియ్యం ఖరీదును వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తారు. ప్రభుత్వానికి చేరని పన్నులు విధించి ప్రయోజనమేమిటి? ప్రజలకు చవక ధరలకు బియ్యం లభించాలంటే ప్రభుత్వం పెద్దయెత్తున జోక్యం చేసుకుని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అన్ని రకాల బియ్యాన్ని సరఫరా చేయాలి. పన్నుపోటు లేకుండా సరఫరా చేస్తే మరీ మంచిది. అంతేగాని అంతరాష్ట్ర రవాణాను నిషేధించడం ఏ విధంగా చూసినా సమస్యకు పరిష్కారం కాబోదు. ఆర్థిక రంగంలో వ్యవసాయం వాటా తగ్గుతూ వస్తోంది. వ్యవసాయ వృద్ధి శాతం రెండు శాతానికి పడిపోయింది. 2012-13లోనూ అది మూడు శాతాన్ని మించబోదన్నది అంచనా. పెరిగే జనాభాకు అనుగుణంగా సేద్యం విస్తరించకపోతే ఆహార సంక్షోభం ముమ్మరిస్తుంది. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అలవాటైన ఆహారం బియ్యమే. ప్రజలందరికీ వారి వారి తాహతును బట్టి సరసమైన ధరలకువిక్రయించే దిశగా విధానాలను రూపొందించాలి. ధాన్యాన్ని పండించే రైతుకు భద్రత చేకూర్చే చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం ఆహార భద్రత బిల్లును చట్టంగా రూపొందించదలచిన తరుణంలో రాష్ట్రప్రభుత్వం ఆంక్షల బంధనాలు సడలించి హేతుబద్ధమైన ఆహార విధానానికి తెర లేపాలి. రైతు సురక్షితంగా లేకపోతే ప్రజలకు ఆహారభద్రత అసాధ్యమని గుర్తించాల్సిన తరుణమిది. ◆

(ఈనాడు సౌజన్యంతో...)

# రైతు పాదయాత్ర

వెలుగులు పంచే సూర్యుడు అస్తమించినా,
వెన్నెల కురిపించే చందమామ కరిగిపోయినా
కనురెప్ప మూయకుండా
రాబోయే తరాల వారి ఆకల్ని తీర్చేందుకై
చిమ్మచీకట్లను తన కళ్ళతో ఛేదించి...
క్షామం ఆకలిని జయించకముందే కళ్ళు తెరిచాడు
కళ్ళు మూతలు పడని అన్నదాత

ప్రకృతి భయపెట్టినా... ఆకాశం మోసం చేసినా చలించడు
నాటిన మొక్కలు చిగురించకపోతే చలిస్తారు.
తను వేసిన పంట చేతికందకపోతే బాధపడతాడు

నేతలు తన కలలను చెరిపేసినా...
రెక్కల కష్టాన్ని నమ్ముతాడు కానీ మోసాన్నెరుగడు.
మళ్ళీ రెట్టించిన విశ్వాసంతోటి
తన రక్తాన్ని చిందించైనా పంట పండిస్తాడు

భూ కక్ష్య నిలిచిపోయినా...
ఉపగ్రహాలు అపసవ్య దిశలో నడిచినా చలించడు
అప్పల కుప్పలు పర్వతాలై కూచుంటే
ఆత్మహత్యయినా చేసుకుంటాడు
కానీ తను నమ్మిన నేలను మాత్రం అమ్ముకోడు

అన్నదాత పెదాలపై చెరగని చిరునవ్వు కోసం చేసే ఈ పాదయాత్రను విజయవంతం చేసే ప్రతి అన్నదాతలకు అంకితం.

కె.పాలవాయి రాధిక
రాయదుర్గం, అనంతపురం

# ఆంక్షల్ని తొలగిస్తేనే రైతులకు కనీస ఆదాయం

- డా॥ పి. భాస్కరరావు

కార్యదర్శి, రాష్ట్ర స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య

'పాలసీలు మారిస్తేనే రైతులకు భవిత' పేరుతో 07-03-2012న ఆంధ్రజ్యోతి దినపత్రిక ఎడిట్ పేజీలో విజయ్ కుమార్ నీలయపాలెంగారితో కలిసి శ్రీశైల్‌రెడ్డి పంజుగులగారు (తెలుగుదేశం పార్టీ రైతు అధ్యయన కమిటీ) రాసిన వ్యాసంలో రైతుల పట్ల ప్రేమకన్నా స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ (జేపీ) 'రైతు సత్యాగ్రహ యాత్ర' పట్ల దుగ్ధ ఉన్నట్టు కనిపించింది. ఫిబ్రవరిలో కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు జేపీ పార్టీలకతీతంగా స్వతంత్ర రైతుసంఘాల పతాకం మీద చేసిన రైతు సత్యాగ్రహ యాత్రలను ఎడ్లబండ్ల ఉద్యమాలుగా పేర్కొంటూ, సరిహద్దు రాష్ట్రాలకు ధాన్యం, బియ్యం ఎగుమతులను అనుమతిస్తే రైతుల బాధలు తీరుతాయా అని విషయాన్ని పక్కదోవ పట్టించేరీతిలో విమర్శలు చేశారు. ఆంక్షలు ఎత్తివేత వల్ల రైతులకు మేలు జరుగుతుందన్న జేపీ లేవనెత్తిన వాదనను తిప్పికొట్టలేక, కేవలం పదాలతో ఎద్దేవా చేస్తూ పల్టీలు కొడుతూ మళ్లీ జేపీ చేసిన వాదనల్నే తిప్పితిప్పి చెప్పారు వ్యాసరచయితలు. రైతును చావనీయకుండా బతకనివ్వటానికి జేపీ చెప్పిన స్థాయిలో కాకుండా కొంతమేర మార్కెట్ సంస్కరణలు తీసుకొస్తే చాలు అనేరీతిలో వారి వ్యాసం సాగింది. దేశం మొత్తం మీద అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి వందమందిలో 82మంది రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోవటానికి, పెద్దసంఖ్యలో ఆత్మహత్యలు చేసుకోవటానికి కాంగ్రెస్ వ్యవహారశైలితోపాటు 17 ఏళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ చంద్రబాబు హయాంలో వ్యవసాయం పట్ల అనుసరించిన వైఖరి కూడా కారణమనే పశ్చాత్తాపం కూడా లేకుండా శ్రీశైల్‌రెడ్డిగారు ఈ వ్యాసం రాసినట్టు కనిపిస్తుంది. జేపీ చేసిన పోరాటం వల్ల కేంద్రప్రభుత్వం ఎగుమతులకు అనుమతివ్వబట్టే గత సీజన్‌లో ధాన్యం రేట్లు కొంతయినా పెరిగాయని, పత్తికి రికార్డుస్థాయిలో క్వింటాలుకు రూ.7000వరకూ రేటు వచ్చి రైతులకు కొంత ఉపశమనం లభించిందనే వాస్తవాల్ని కూడా విస్మరించి వారు ఇలా రాయటం బాధాకరం. వ్యాసకర్తలు స్పృహలో ఉండిరాశారో లేక నిస్పృహలో ఉండి ఆరోపణలు చేశారో అనిపించకమానదు. ఇతర రాష్ట్రాలతో సంబంధాలు, జాతీయస్థాయిలో అంశాల మీద తెలుగుదేశం వంటి ఒక ప్రాంతీయపార్టీకి సాధారణంగా ఉండే హ్రస్వ దృష్టి కూడా ఈ ఆరోపణలకు దోహదం చేసి వుండవచ్చు. కేవలం రాజకీయ కోణంలో ఉద్దేశపూర్వకంగా చేసిన ఈ వంకర ఆరోపణలకు వాస్తవానికి స్పందించాల్సిన పన్లేదు, కానీ పక్కదోవ పట్టిస్తున్న వాదనలకు సరైన జవాబు చెప్పకపోతే కొంతమందైనా అపార్థం చేసుకుని ఒక మంచి లక్ష్యసాధనలో తాత్కాలిక అవరోధాలు ఏర్పడే అవకాశముంది. అందుకే జేపీ యాత్ర పూర్వాపరాల్ని, దానితో ముడిపడిన కొన్ని అంశాలను ఈ వ్యాసం ద్వారా రైతులకు, వివిధ వర్గాల ప్రజలకు తెలియచేస్తున్నాం.



దేశ అవసరానికి కావలసిన దానికంటే మూడరెట్లు ఎక్కువగా దాదాపు 5కోట్ల టన్నుల బఫర్ నిల్వలు గోదాములలో, ఆరుబైట మూలుగుతూ, ఎండకుఎండి వానకు తడుస్తూ

పందికొక్కులకు ఆహారమవుతుంటే, మరోపక్క విదేశీమార్కెట్‌లలో గిరాకీ ఉన్నా మన ధాన్యం రైతులకు ధర రాని పరిస్థితులలో రాష్ట్రంలో, దేశంలో మునుపెన్నడూ లేని వినూత్న, సమగ్ర విధానాలతో జయప్రకాష్ నారాయణ్ వ్యవసాయరంగ విముక్తి కోసం ఒక ఉద్యమాన్ని 2010లో ప్రారంభించారు. దశాబ్దాలపాటు రైతు సమస్యల మీద పోరాడుతున్న శరద్‌జోషి వంటి నిఖార్సయిన జాతీయ నేతలందరితో చర్చించాక వ్యవసాయరంగ విముక్తికి సమగ్ర ఎజెండాతో ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్టు అక్టోబర్ 14, 2010న జేపీ ప్రకటించారు. రైతులు తాము పండించిన పంటను ప్రపంచంలో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడ అమ్ముకునేందుకు అనుమతినిచ్చేలా వారికి స్వేచ్ఛను అందించాలని, పారిశ్రామికవేత్తలకున్న స్వేచ్ఛావాణిజ్యం రైతులకు కూడా ఉండాల్సిందేనని జేపీ వాదించారు. ఇందుకోసం ఏకాభిప్రాయ సాధనకు అక్టోబర్ 16, 2010న అఖిలపక్షాలు, రైతుసంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే తెలుగుదేశం పార్టీ కూడా హడావుడిగా అదేరోజున అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. తాము నిర్వహించాలనుకున్న సమావేశాన్ని టీడీపీ నిర్వహిస్తే తమకేమీ అభ్యంతరం లేదని జేపీ టీడీపీ కార్యాలయానికి సమాచారం కూడా ఇచ్చారు. అయితే అక్కడ నుంచి ఎటువంటి సమాచారం లేకపోవటంతో చివరకు అక్టోబర్ 16న రెండు సమావేశాలూ వేర్వేరుగా జరిగాయి. రైతుల సమస్య మీద ఎవరు పోరాడినా మద్దతు ఇవ్వాలనే నిబద్ధతతో జేపీ పొద్దునపూట ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన సమావేశానికి ఎటువంటి భేషజాలకు పోకుండా లోక్‌సత్తా పార్టీ తరుపున హాజరయ్యారు. రైతుల ఉత్పత్తులకు నిర్నిబంధంగా ఎగుమతి హక్కులు ఉండాలని, ఎటువంటి ఆంక్షలు ఉండకూడదని జేపీ అక్కడ కూడా కుండబద్దలు కొట్టారు. కానీ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆ వాదాన్ని విమర్శించారు. వినియోగదారులకు రేట్లు పెరిగితే మళ్లీ విమర్శలు ఎదుర్కోవలసి వస్తుందని చంద్రబాబు సహా టీడీపీ సీనియర్ నేతలంతా జేపీ వాదాన్ని విమర్శించారు. (ఇదే చంద్రబాబు ఫిబ్రవరి 28, 2012న అసెంబ్లీలో జరిగిన చర్చలో బియ్యం రవాణాపై ఆంక్షలు ఎత్తివేయాలని, వినియోగదారుల పేరు చెప్పి రైతులను నాశనం చేయకూడదని వాదించి వాకౌట్ చేశారు). ఆ తర్వాత సాయంత్రం స్వతంత్ర రైతు సంఘాలతో కలిసి ఫ్యాప్సీహాల్‌లో జేపీ రౌండ్‌టేబుల్‌ని నిర్వహించారు. ఒక్కో పంటకూ ఒక్కోరీతిలో రైతులకు లాభం చేకూరేలా విధానాల్ని ఆ సమావేశంలో ప్రకటించారు. వాటిని స్థూలంగా అందరూ సమర్థించారు. చాలా మౌలికమైన ప్రశ్నల్ని లేవనెత్తి పరిష్కారాలను చూపించింది ఆ సమావేశం. అప్పట్నుంచి అదే బాటలో పోరాడుతూ ఆంక్షల ఎత్తివేతకు జేపీ పోరాడుతూ వచ్చారు.

రైతు భద్రత లేకుండా ఆహారభద్రత సాధ్యం కాదని జేపీ పదేపదే స్పష్టంచేశారు. 9లక్షలమంది ఉన్న ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వం మెడలు వంచి తమ డిమాండ్లను సాధించుకుంటుంటే రాష్ట్రంలో కోటీ 20లక్షల దాకా వున్న రైతులు కులం,ప్రాంతం,పార్టీ,పంట పేరుతో విడిపోవటం వల్ల వారిలోని అనైక్యతను పునాదిగా చేసుకుని ప్రభుత్వాలు, పార్టీలు రైతులను మోసం చేస్తున్నాయన్న వాస్తవాన్ని రైతులకు వినిపించేందుకు కాలికి బలపం కట్టుకుని రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా ఇతర రాష్ట్రాలలో కూడా తిరిగారు. అందుకే రైతు ఐక్యతా ఉద్యమాన్ని పార్టీలకతీతంగా చేపట్టారు. అందరినీ సమీకరించారు. అసెంబ్లీలో రైతులపక్షాన గళం విప్పారు. అన్ని పంటల రైతు సంఘాలతో కలిసి స్వతంత్ర రైతుసంఘాల సమాఖ్యను ఏర్పాటు చేశారు. అలాంటి సంఘాలను మండల స్థాయి నుంచి ఏర్పాటు చేసేందుకు కృషి చేశారు. రైతులకు వారి సమస్యలను, వాటికి పరిష్కారాలను తెలుసుకోకుండా రాజకీయ నేతల చేతిలో మోసపోతూ ఓటుబ్యాంకులుగా మిగిలిపోయిన రైతులకు వాస్తవాల్ని వివరించేందుకు కరపత్రాల్ని, ఇతర సాహిత్యాన్ని విరివిగా అందించారు. ప్రస్తుత ప్రధానమంత్రి, ఆర్థికమంత్రి 1990లలో ఆర్థికమంత్రి, వాణిజ్యమంత్రులుగా ఉన్నప్పుడు... మనదేశంలో తక్కువ ధరకు ఉత్పత్తి అయ్యే వ్యవసాయోత్పత్తులకు విదేశాలలో డిమాండ్ ఉన్నప్పుడు అమ్ముకునేందుకు స్వేచ్ఛగా అనుమతిస్తామని పార్లమెంటు ముందు అధికారిక ప్రకటన చేసిన విషయాన్ని జేపీ వెలికితీసి నిలదీశారు. ఢిల్లీ స్థాయిలో పోరాడి చివరకు బియ్యం ఎగుమతులపై ఆంక్షల్ని కొంతమేరైనా తొలగించేలా చేయగలిగారు. ఇందుకు స్వతంత్ర రైతుసంఘాల నేతలతోపాటు అన్ని పార్టీల నాయకులు కూడా కలిసివచ్చారు.

పంటల్ని ఉత్పత్తి చేసి అమ్ముకునేవారు సొంతదారులైనా, కౌలుదారులైనా అందరూ రైతులేనని, వ్యవసాయరంగంలో ఉన్న పాపానికి గ్రామాలలోని రైతుకుటుంబాల ఆదాయం నెలకి రూ.5,000 ఉంటే పట్టణాలలో వ్యవసాయేతర రంగాలలోని వారి ఆదాయం అంతకు 8రెట్లు ఉందని, ఇదేతీరుగా రైతుల మీద ఆంక్షల్ని కొనసాగిస్తూ, వారిని ఓటుబ్యాంకులుగా మాత్రమే

వినియోగించుకుంటుంటే ఆ అంతరం ఇంకా పెరిగిపోయి సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వినాశకర పరిణామాలు వస్తాయని జేపీ అందరి దృష్టికీ తీసుకొచ్చారు. ఆయన అసెంబ్లీలో ఈ వాస్తవాలతో వాదించబట్టే కూరగాయల ధరలు, ఉల్లిపాయల ధరలు కాస్తపెరగగానే వాటిని మెడలో వేసుకుని ప్రదర్శనలిచ్చి, వాటి ధరలు పడిపోగానే రైతుల్ని గాలికొదిలేసే టీడీపీ వంటి పార్టీలు గత రెండేళ్లుగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో అలాంటి గిమ్మిక్కులను తగ్గించాయి. కానీ జేపీ చెప్పినవి అంగీకరించినట్టు కనిపిస్తే తమకు క్రెడిట్ రాదేమోనని భయపడుతూ రైతులను రాజకీయంగా చీల్చే ప్రయత్నాల్ని మాత్రం కొనసాగిస్తున్నారు.

జేపీ, స్వతంత్ర రైతుసంఘాలు పోరాడి ఆంక్షల్ని కొంతయినా ఎత్తివేసేలా చేయబట్టే కొన్ని పంటలకైనా రాష్ట్రంలో రేట్లు వచ్చాయి. పత్తి ఎగుమతుల వల్ల తమ రాష్ట్రంలో మిల్లులకు నష్టంవస్తుందని, పత్తి ఎగుమతుల్ని ఆపివేయాలని అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి కరుణానిధి కేంద్రప్రభుత్వానికి లేఖ రాస్తే, జేపీ గట్టిగా అడ్డుకుని పత్తి ఎగుమతుల్ని కొనసాగించేలా చేయగలిగారు. కేవలం పత్తి ఎగుమతులవల్లే గత ఏడాది పత్తి పంటకు రికార్డు స్థాయిలో క్వింటాలుకు రూ.7000 వరకూ ధర లభించి, మన రాష్ట్రంలోని తెలంగాణ రైతులు కొంతమేర ఉపశమనం పొందగలిగారు. జేపీ ఆరోజు ఎగుమతులకు పట్టుపట్టకపోతే ధాన్యం రైతులకు ఈపాటి ధరయినా లభించేదా? పత్తికి అంత రికార్డుస్థాయి ధర లభించేదా? మన పక్కరాష్ట్రమైన కర్ణాటకలో ధాన్యం బస్తాకి మన రాష్ట్రంలోకంటే రూ.200 వరకూ ఎక్కువ వస్తున్నా అక్కడ అమ్ముకోకూడదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆంక్షలు విధించిందా? లేదా?... రైతుల సమస్యల్ని కేవలం కాసిని సబ్సిడీలు, ఉచితాలు, రుణమాఫీలకే పరిమితం చేసి తీరని అన్యాయం చేసింది చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ ప్రభుత్వం. చాలా సంకుచిత రాజకీయ దృష్టితో ఆలోచించి రైతులకు మార్కెటింగ్ అవకాశాల్ని దెబ్బతీసింది. ఈవేళ జనాభాలో 60శాతం మేర ఉన్న రైతులకు లాభం చేకూర్చేలా వ్యవసాయోత్పత్తుల చిల్లర వర్తకంలోకి పెట్టుబడులు వస్తుంటే, దాన్ని వ్యతిరేకించినవారిలో తెలుగుదేశం లేదా? ఎన్నాళ్లు రైతుల్ని మోసం చేద్దామనుకుంటున్నారు? ఓటుబ్యాంకు రాజకీయాలకు తలగ్గకుండా వ్యవసాయరంగంలోకి విదేశీ/స్వదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రావాలని నిర్వంద్వంగా డిమాండ్ చేసింది జేపీ, స్వతంత్ర రైతుసంఘాలు మాత్రమే. రైతులు తాము పండించిన ఉత్పత్తికి రూ.35 పొందుతుంటే, వినియోగదారులు అదే ఉత్పత్తిని కొనటానికి రూ.100 చెల్లిస్తున్నారని, రిటైల్ చైన్ల ఏర్పాటుతో మధ్య దళారీ వ్యవస్థను తొలగిస్తే రైతుకు, వినియోగదారునికీ లాభం జరుగుతుందని జేపీ గట్టిగా పోరాడుతున్నారు.

'పాలసీలు' మారిస్తేనే రైతులకు భవిత అనే మాటల్ని ఈవేళ వల్లిస్తున్న తెలుగుదేశం రైతు అధ్యయన కమిటీ ఏనాడైనా పాలసీల గురించి ఆలోచించిందా? వ్యవసాయం అంటే సబ్సిడీలు, రుణమాఫీలు కాదు, వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా విధానాల్ని మార్చాలి అని జేపీ చెప్పినాకే గదా ఆ మాటల్ని ఇప్పుడు ఉచ్చరిస్తున్నారు? భారతదేశంలోనే అత్యధికంగా రైతుల మీద పన్నులు విధిస్తున్నది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని, పక్కరాష్ట్రాలలో అమ్మకూడదని ఆంక్షలు పెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని బైటపెట్టింది జేపీ. మరేరంగంలోని వారికీ లేని ఆంక్షలు రైతులకు ఎందుకు? అనే మౌలిక ప్రశ్నకు వ్యాసరచయితలు సమాధానం చెప్పాలి. పారిశ్రామికవేత్తలు లాభాల్ని చూసుకున్నట్టే రైతు కూడా తాను పండించిన ఉత్పత్తులకు లాభాల్ని చూసుకుని, అందుకు కావలసినట్టు వ్యవహరిస్తాడు. దానికెందుకు అభ్యంతరం? రైతులేమన్నా బిచ్చగాళ్లా? వారికి స్వతంత్ర జీవనం లేదా? పరిశ్రమలకు ముడిసరకుల్ని ఉత్పత్తిచేసే యంత్రాలా వాళ్లు? ఖచ్చితంగా రైతులు తమ ఉత్పత్తుల్ని తమకు ఇష్టమొచ్చినచోట, ఇష్టమొచ్చిన రేట్లకి అమ్ముకునే స్వేచ్ఛ ఉండాలి.

అలాగే ఆంక్షల తొలగింపు ఒక్కటే చాలదని, దాంతోపాటు ఒక్కో పంటకూ ఒక్కోరీతిలో లాభం చేకూరేలా స్వల్పకాలిక, మధ్యకాలిక చర్యలు చేపట్టాలని జేపీ చెబుతూవచ్చారు (ఈ వాస్తవాన్ని శ్రీశైల్ రెడ్డి, విజయ్‌కుమార్ తమ వ్యాసంలో దాటవేశారు).

**ఆంక్షల తొలగింపు సహా వ్యవసాయరంగ విముక్తికి జేపీ సూచించిన వివిధ చర్యలు స్థూలంగా:**

ఆహారభద్రతపోను మిగులు ధాన్యాల్ని ప్రపంచంలో ఎక్కడ రేటు ఉంటే అక్కడ అమ్ముకునే అవకాశం రైతులకు కల్పించాలి. పత్తి వంటి వాణిజ్య పంటల్ని ఎప్పుడైనా, ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛను నిర్నిబంధంగా రైతులకు ఇవ్వాలి. ఇందుకోసం స్థిరమైన విధానాన్ని రూపొందించి తగిన సంస్థాగత ఏర్పాట్లు చేయాలి.

బియ్యం ఎగుమతులకు ఎఫ్‌సిఐతోపాటు ఎస్‌టిసి, పిఇసి, ఎంఎంటిసి తదితర ప్రభుత్వ ఏజెన్సీలను వినియోగించుకోవాలి. అటువంటి ఎగుమతిపై అమ్మకం ధరకు సంబంధించి

ఎటువంటి ముందస్తు షరతులూ ఉండకూడదు. ఖర్చులు పోగా కనీస లాభమైనా ఇచ్చే ధర దేశానికి, వ్యవసాయరంగానికి లాభదాయకమవుతుంది.

గ్రామీణాభివృద్ధి సెస్సు, వ్యాట్ (విలువ ఆధారిత పన్నులు) ద్వారా బియ్యం సేకరణపై రూ.1500కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వసూలు చేస్తోంది. ఈ ఆదాయాల్ని రైతులకు బోనస్ ఇచ్చేందుకు ఉపయోగించవచ్చు. ధాన్యాన్ని నేరుగా సేకరించి, మిల్లు ఆడించిన బియ్యాన్ని లెవీ పథకం కింద ఎఫ్‌సిఐకి సరఫరా చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టేలా చేయాలి.

వ్యవసాయ దిగుమతులపై కొంతమేర దిగుమతి సుంకం విధించటం నిరంతర ప్రాతిపదికన జరగాలి. అలా వచ్చిన ఆదాయాన్ని ఆ పంటను పండించే రైతులకు ప్రోత్సాహకంగా ఇవ్వాలి. ఉదాహరణకు, పామాయిల్ వంటి నూనెగింజలు.

వ్యవసాయరంగంలోకి పెద్దఎత్తున రిటైల్ దుకాణాలను తీసుకురావాలి. నిల్వఉండకుండా కుళ్లిపోయే పంటలకు సంబంధించి, మార్కెట్ అంచెల్ని తగ్గించేందుకు రిటైల్ మార్కెట్ గొలుసుల్ని దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ప్రోత్సహించాలి. దానికితోడు, అవసరమైన కోల్డ్ స్టోరేజీ, ఆగ్రో ప్రాసెసింగ్ సదుపాయాలను తగినన్ని ఏర్పాటు చేసి పండ్లు, కూరగాయలు పండించే రైతులకు కనీస ధర గ్యారంటీగా అందించాలి. మార్కెట్ ధర బాగా ఉన్నప్పుడు ఆ రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకుంటారు, లేనప్పుడు కోల్డ్ స్టోరేజీ సదుపాయాన్ని వినియోగించుకోవటమో లేదా కనీస ధరకు ప్రాసెసింగ్‌కు అమ్ముకోవటమో చేసే విధంగా ఉండాలి. రైతులు తమ ఉత్పత్తుల్ని నిల్వ చేసుకునేందుకు తగిన గోదాముల్ని నిర్మించి ప్లెడ్జి రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయాలి.

ఇన్‌పుట్ సబ్సిడీలను పెంచటంతోపాటు ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలి.

మార్కెట్లో మిగులు ఉత్పత్తులు పేరుకుపోకుండా వీలున్నచోటల్లా ఆహారేతర ఉత్పత్తులు పండించేందుకు రైతుల్ని ప్రోత్సహించాలి. ఇందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అగ్రిక్లినిక్‌ల వంటివి ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలి. వ్యవసాయరంగ సమస్యలు–పరిష్కారం నిరంతర ప్రక్రియకాబట్టి అందుకోసం పరిశోధనా కేంద్రాలతో అగ్రిక్లినిక్‌లను అనుసంధానం చేయాలి.

మార్కెట్ యార్డులను ప్రక్షాళన చేసి రైతుల ఆధ్వర్యంలోనే నడపాలి. రైతుల నుంచి వసూలు చేసిన అన్ని పన్నుల్నీ వ్యవసాయరంగం మీదే ఖర్చు చేయాలి.

ఈ వాస్తవాల్ని రైతులలోకి తీసుకెళ్లేందుకు... 1930లలో భారత స్వతంత్ర పోరాటంలో గాంధీ సింబాలిక్‌గా చేసిన ఉప్పు సత్యాగ్రహ యాత్ర స్ఫూర్తిగా తీసుకుని జేపీ సింబాలిక్‌గా రైతు సత్యాగ్రహ యాత్ర చేసి రైతు స్వతంత్ర పోరాటాన్ని రాజకీయానికి కేంద్రబిందువుగా చేశారు . జెండాల్ని పక్కనపెట్టి అందరూ ఈ యాత్రలో పాల్గొనాలని స్వతంత్ర రైతు సంఘాలు ఇచ్చిన పిలుపునకు స్పందించి కాంగ్రెస్, సీపీఐ, వైఎస్సార్ కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ జేపీ యాత్రకు మద్దతు పలికాయి. తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు కూడా అనేకచోట్ల కలిసివచ్చారు. చంద్రబాబు నాయుడు రైతు వ్యతిరేక విధానాల్ని ఒప్పుకోలేక, జేపీ చెప్పిన విధానపరమైన మార్పుల్ని, వాటికి ప్రజలలో లభిస్తున్న ఆదరణని ఓర్చుకోలేక శ్రీశైల్ రెడ్డిగారు మాత్రం విమర్శలు గుప్పిస్తున్నారు. దాదాపు 5కోట్ల టన్నుల ఆహారధాన్యాలు గోదాములలో, ఆరుబైట ముక్కిపోతుంటే, పందికొక్కులు తింటుంటే, రైతులకు రేటు రాక అల్లాడుతుంటే, ఆంక్షల తొలగింపు అసలు సమస్యేకాదని ఎలా అనగలుగుతున్నారు? ఎంత అమానుషమది? మన రైతుకి కిలోబియ్యానికి రూ.10 లభిస్తున్న రోజున రష్యాలో కిలో రూ.120 అమ్మితే, అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో తక్కువలోతక్కువ రూ.80 పలికితే రైతుకు అంతరేటు వచ్చే ఏర్పాటు చేయాలన్న ధ్యాసే లేని మీరు రైతులకు మేలుచేస్తున్న జేపీని విమర్శించటం దివాళాకోరుతనమే. రైతులు వెర్రినాగన్నలు, వారికి ఈ వాస్తవాలు తెలియవు అనే ధైర్యంతోనే మీరు ఇలాంటి విమర్శలు చేస్తున్నారు.

తమ వాదనలు వినిపించుకునే హక్కు ఎవరికైనా ఉంటుంది. కానీ ఆ పేరుతో నిబద్ధతతో కృషి చేసేవారి మీద బురద జల్లకూడదు. రైతు సత్యాగ్రహ యాత్రపై మీరు చేసిన అనుచిత విమర్శలకు ఇంకా తీవ్రస్థాయిలో సమాధానం ఇవ్వవచ్చు. కానీ రైతుల సమస్యలు పరిష్కారానికి రైతుల ఐక్యత ముఖ్యం. అందుకు పార్టీలు, విమర్శలు– ప్రతివిమర్శలు ఆటంకం కారాదు. అందుకే గుడ్డుమీద ఈకలు పీకే కార్యక్రమానికి స్వస్తి చెప్పి రైతు విముక్తిలో కలిసిపోరాటానికి ముందుకు రండి. చిన్నచిన్న విభేదాలేవైనా ఉంటే హేతుబద్ధ చర్చలతో పరిష్కరించుకోవచ్చు. రైతుల్ని, గ్రామీణ ప్రాంతాల్ని విముక్తి చేసి తద్వారా ఈ దేశ ఆర్థికవ్యవస్థను సుస్థిర అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లకపోతే మనల్ని భావితరాలు క్షమించవు. ◆

# నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ - పాలకుల పాపం

**- యం. అప్పిరెడ్డి**

కన్వీనర్, నిజాంషుగర్స్ పరిరక్షణ కమిటీ

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో 1937లో నిజాం కాలంలో స్థాపించబడిన "నిజాం షుగర్ ఫ్యాక్టరీ" ఒకప్పుడు ఆసియాఖండంలోనే అతిపెద్ద ఫ్యాక్టరీగా ప్రసిద్ధిచెందినది. తెలంగాణా ప్రజల వారసత్వ సంపదగా పేరు గాంచింది. గత 6.5 సంవత్సరాలు ప్రభుత్వరంగంలో నడిచి, రైతులకు కార్మికులకు ఎంతో ఉపయోగపడినది. చెఱకు రైతులకు రాష్ట్రంలో మిగిలిన ఫ్యాక్టరీలకన్నా అధిక ధర వచ్చేది. కొన్ని సంవత్సరాలు దేశంలోనే అందరికన్నా అధిక చెరకు ధర చెల్లించేది. కార్మికులకు మెరుగైన జీవనాన్నిచ్చింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించింది. ప్రభుత్వరంగంలో నున్న నిజాంషుగర్స్, రైతులకు మంచిధర ఇవ్వటంతో, రాష్ట్రంలోని ప్రైవేటు, షుగర్ ఫ్యాక్టరీలు కూడా, తప్పనిసరిగా ఇష్టమున్నా లేకున్నా, చెరుకుకు, నిజాంషుగర్ ఫ్యాక్టరీ ధరలలో ఇందుమించు సమానధరలు ఇవ్వవలసి వచ్చేది. ఈ రకంగా, పరోక్షంగా, రాష్ట్రంలోని అందరు చెరకు రైతులకు మెరుగైన ధరలు లభించేవి. నిజాం షుగర్స్ ప్రభుత్వరంగంలో నున్నంతకాలం రాష్ట్రంలో ఏ ఇతర ప్రవేటు, సహకార ఫ్యాక్టరీలు కూడా రైతులకు, నిజాం షుగర్స్‌తో సమానంగా గానీ అధికంగా గానీ చెరకు ధర ఇవ్వలేదు. మన రాష్ట్రంలో, రాజకీయ జోక్యం మూలంగా సహకార రంగం భ్రష్టుపట్టింది.

2002లో నిజాం షుగర్ ఫ్యాక్టరీల ప్రైవేటీకరణతో పరిస్థితి ఒక్కసారిగా తారుమారైంది. రాష్ట్రంలో పండిస్తున్న చెరకు ఎక్కువభాగం, అంటే సంవత్సరానికి సుమారు కోటి టన్నులు, కొద్ది మంది చేతులలోనున్న "ప్రైవేటు షుగర్ ఫ్యాక్టరీలు" గానుగాడుతున్నవి. ప్రభుత్వరంగంలో నున్న నిజాం షుగర్స్ చెరకుకు మంచి ధరలు చెల్లించడంతో, రాష్ట్రంలోని ప్రైవేటు ఫ్యాక్టరీలు, తమ లాభాలలో నుంచి, తప్పనిసరిగా ప్రతిసంవత్సరం కొన్ని కోట్ల రూపాయలు అదనంగా ఆయా ఫ్యాక్టరీల క్రింద రైతుల చెరుకుకు చెల్లించాల్సి వచ్చేది.



నిజాంషుగర్ ఫ్యాక్టరీ, ప్రభుత్వ రంగంలో ఉండుట మూలంగా తమ లాభాలు తగ్గించుకొని, రైతులకు మెరుగైన చెరకు ధర ఇవ్వాల్సి వచ్చిందని, దీనిని అధిగమించి, తమ లాభాలను పెంచుకొనాలంటే, ప్రభుత్వరంగంలో నున్న నిజాం షుగర్స్‌ని ప్రవేటీకరించాలని, ప్రైవేటు ఫ్యాక్టరీల యజమానులు అప్పటి ముఖ్యమంత్రి – చంద్రబాబునాయుడు మీద ఒత్తిడి తెచ్చి, ప్రజాభిష్టానికి భిన్నంగా జాయింట్ వెంచర్ పేరున ప్రైవేటీకరింపచేసారు.

ఫ్యాక్టరీ నష్టాలు లేకున్నా, నష్టాలలో ఉన్నవని, గోబెల్స్‌ప్రచారం చేసి, బోధన్, మెదక్, కరీంనగర్‌లోని మెట్‌పల్లి షుగర్ ఫ్యాక్టరీలు, బోధన్‌లో గల రెండు డిస్టిలరీలు, 500 కోట్ల రూపాయాల విలువ గల, తెలంగాణా ప్రజల వారసత్వం ప్రజల సంపదను, కేవలం 65 కోట్ల రూపాయాలకు, విజయవాడకు చెందిన గోకరాజు గంగరాజుకు లాలూచీపడి, ధారాదత్తం చేసారు.

ఇంకొక విచిత్రం, ప్రైవేటుపరం చేసి 11 సంవత్సరాలు అయినా యాజమాన్యం ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందా లన్నింటిని అతిక్రమించి ఇప్పటివరకు 1 రూపాయి కూడా కొనుగోలు బాపతుకు గాను, ప్రభుత్వానికి జమ చేయలేదు. అంటే విలువైన వందల కోట్ల రూపాయల ప్రజల ఆస్తులు, ప్రైవేటు వాళ్ళు, స్వార్ధపర రాజకీయ నాయకుల అండదండలతో ఏవిధంగా దోపిడీ చేస్తున్నరనడానికి ఇదే నిదర్శనం,

ఈ ప్రైవేటీకరణ మూలంగా, గతానికి భిన్నంగా, చెరకుకు మెరుగైన ధర రాక, ఈ ఫ్యాక్టరీల క్రింద చెరుకు పంటను తగ్గించి, ఇతర పంటలకు మరలినారు. ఫలితంగా బోధన్ ఫ్యాక్టరీ క్రింద గతంలో సంవత్సరానికి 6 లక్షల టన్నులు సరాసరి క్రషింగ్ ఉండగా, ప్రస్తుతం కేవలం లక్ష టన్నుల లోపునకు పడిపోయింది. ప్రభుత్వరంగంలో 2,200 మంది కార్మికులు ఉండగా, ప్రైవేటీకరణ మూలంగా 1800 మంది కార్మికులను నిర్దాక్షిణ్యంగా తొలగించి ఇంటికి సాగనంపారు. ఈ కుటుంబాలు రోడ్డున పడి నిరుద్యోగంతో బాధపడుతూ 200 మందికి పైగా ఇప్పటి వరకు ఆత్మహత్యలకు గాని, ఆకలి చావులకు గాని గురైనారు. ఇది, రైతులపైన, కార్మికులపైన ప్రభుత్వం చేసిన దుర్మార్గం . ఈ ప్రైవేటీకరణ క్రమంలో పాలక పార్టీలకు చెందిన రాజకీయ నాయకులకు, అవినీతిపరులైన అధికారులకు కోట్ల రూపాయల ముడుపులు ముట్టినవనేది బహిరంగ రహస్యం.

ప్రభుత్వరంగంలో ఆరోగ్యకరమైన పోటీ లేకపోవడం మూలంగా, ప్రైవేటు ఫ్యాక్టరీల యాజమాన్యాలు సిండికేట్ అయి, రైతులకు గిట్టుబాటు ధర చెల్లించకుండ దోపిడీ చేస్తున్నారు. డబ్బుసంచులు వెదజల్లి, రాజకీయ పార్టీలను, ప్రభుత్వాలను లోబరచుకుంటున్నారు. దీంతో చెరకు రైతులకు, రాష్ట్రవ్యాప్తంగా సరైన ధర రాక తీవ్రంగా నష్టాలపాలవుతూ ఇతర పంటలకు మరలుతున్నారు. దేశ మొత్తం మీద మన రాష్ట్రంలోనే చెరకు పంటకు అతి తక్కువ ధర వస్తుంది. ఇది మన పాలకులకు రైతుల యెడ వున్న సవతి తల్లిప్రేమ. దీంట్లో కొసమెరుపు ఏమంటే 2002 సం॥లో తెలుగుదేశంకు చెందిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిజాం షుగర్స్‌ని జాయింట్ వెంచర్ పేరున ప్రైవేటీకరిస్తే, అప్పుడు ప్రైవేటీకరణను వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 7 సంవత్సరాలు గడుస్తున్న, నిజాం షుగర్స్ ప్రైవేటీకరణ కుంభ కోణంపై ఏర్పాటైన “శాసనసభ సంఘం” రిపోర్టు, “జాయింట్ వెంచర్‌ను రద్దుపరచి ఫ్యాక్టరీలను ప్రభుత్వ స్వాధీనం చేసుకొవాలని” సమగ్ర, ఏకగ్రీవ రిపోర్టు ఇచ్చి 5 సంవత్సరాలు అయినా, ఇంత వరకు రద్దు చేయకుండా లాలుచీపడి, మీనమేషాలు లెక్కిస్తూ కాలక్షేపం చేస్తుంది. ఈ విధంగా రాష్ట్రంలో చెరకు రైతులకు, కార్మికులకు, ప్రస్తుత ప్రభుత్వం తీరనిద్రోహం చేస్తుంది. శాసనసభా సంఘం సిఫార్సును అనుసరించి, జాయింట్ వెంచర్‌ను రద్దుపరిచి, ఫ్యాక్టరీలను తిరిగి నడిపించి, రాష్ట్రవ్యాప్తంగా చెరకు రైతులకు న్యాయం జరగాలని, నిజాం షుగర్స్ పరిరక్షణ కమిటీ తరపున రాష్ట్ర హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నాము.

రాష్ట్రంలో చెరుకుకు గిట్టుబాటు ధర రావాలన్నా, కార్మికుల బ్రతుకులు బాగుపడాలన్నా ఇప్పటికైనా రాష్ట్ర వ్యాపితంగా రైతులు, కార్మికులు సంఘటితపడి పోరాడి – నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను రద్దు చేయించి ఆరోగ్యకరమైన పోటీని పునఃరుద్దరించవలసి ఉంది. ■

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

విజయనగరం





**విజయనగరం (కలెక్టరేట్) :** ఇటీవల కాలంలో జిల్లాకేంద్ర ఆసుపత్రితోపాటు ఘోషా ఆసుపత్రిలో వైద్యులసేవలపై పలు ఆరోపణలు వస్తున్నతరుణంలో ఆసుపత్రుల్లోని లోపాలను సవరించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై సదాభిప్రాయాన్ని కల్పించాలని కోరుతూ లోక్‌సత్తాపార్టీ నాయకులు జిల్లా కేంద్ర ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి.విజయలక్ష్మికి వినతిపత్రం ఇచ్చిన లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ తదితరులు మాట్లాడుతూ జిల్లాలోని శృంగవరపుకోట, గజపతినగరంతో పాటు జిల్లా కేంద్రాసుపత్రి, ఘోషా ఆసుపత్రిల్లో నిపుణులైన వైద్యులు ఉన్నప్పటికీ సమస్యలు పరిష్కరించే పూర్తిస్థాయి అధికారులు లేకపోవడంతో పాటు, ఈపరిస్థితులను చక్కదిద్దాలని కోరారు. ఆ పార్టీ మహిళా విభాగం నాయకురాలు ఐ.అనంతలక్ష్మి, ఎం.సుభద్రాదేవి, కె.దయానంద్, తిప్పాన కోటేశ్వరరావు ఎర్రిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని బాధితులను ఆదుకోండి

27 జిల్లాలో వరుసగా జరుగుతున్న అన్ని ప్రమాదాల్లో బాధిత కుటుంబాలకు జిల్లా యంత్రాంగం ఆదుకోవాలని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీశెట్టి అప్పారావు బాబ్జీ కోరారు. జిల్లాలోని జామి మండలం అలమండ, ఎల్.కోట మండలం, మెరకముడిదా, పూసపాటిరేగ తదితర మండలాల్లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని, దీనితో వందల సంఖ్యలో కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తరుణంలో వారిని ఆదుకోవాల్సిన అవసరం జిల్లా యంత్రాంగంపై ఉందని అంటూ ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు బాధితులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ అగ్నిబాధితులకు ఐఎవై ఇళ్లను మంజూరు చేయాలని, ప్రభుత్వం తరపున రావాల్సిన ఆర్థిక సహాయాన్ని ఎటువంటి వివక్ష లేకుండా అందరికి అందజేయాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పి.కె.వి.ఎస్.ఎస్.పి.వర్మ, అప్పారావు, బాధితులు సూరిబాబు, పకీరు, అప్పలరాజు, వరలక్ష్మి నారాయణమ్మ, చిన్నతల్లి, గైరమ్మ, పార్వతి, కొండయ్య పాల్గొన్నారు.

## ఆంక్షలతో రైతులకు నష్టం

**చీపురుపల్లి :** ధాన్యం అంతర్‌రాష్ట్ర రవాణాలో ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుండడంతో రైతులకు నష్టం జరుగుతోందని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు అన్నారు. వరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో చీపురుపల్లి మూడు రోడ్ల కూడలి వద్ద ఒక్క రోజు నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యదర్శి యందవ రమణ, రేగిడి దాలినాయుడు, వి.బాలాజీ, సాయికిరణ్, జి.రాము, బి.అర్జునరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. .

## లోక్‌సత్తా విజయోత్సవ ర్యాలీ

**చీపురుపల్లి :** రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండు చేస్తూ లోక్‌సత్తా పార్టీ అధినేత డాక్టరు జయప్రకాష్‌నారాయణ చేపట్టిన పాదయాత్ర విజయవంతమైన సందర్భంగా ఆ పార్టీ నేతలు సాయంత్రం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. జయప్రకాష్ నారాయణ్ పాదయాత్ర చేస్తూ కర్నాటక రాష్ట్రం వెళ్ళి

ధాన్యాన్ని ఆంధ్రప్రదేశ్ కన్నా అధికంగా అమ్మకం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పట్టణంలో మూడు రోడ్ల కూడలి నుంచి జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కార్యదర్శి యందవ రమణ, యువసత్తా నేతలు రేగిడి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## రాయదుర్గం (అనంతపురం)

### నిజాయితీ గల పార్టీకి మద్దతివ్వండి : లోక్‌సత్తా

నిజాయితీ గల పార్టీలకు మద్దతివ్వాలని లోక్‌సత్తా పార్టీ తాలుకా అధ్యక్షుడు బి. బాబు పిలుపునిచ్చారు. మండలంలోని టీ వీరాపురం, గ్రామదట్ల గ్రామాల్లో ఆయన పర్యటించి ఓటుహక్కు విలువ గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో పాటు వారి జీవితాలతో ఆడుకుంటోందని విమర్శించారు. రైతులకు యువకులు అవగాహన కల్పించి చెడు రాజకీయాలను తరిమికొట్టాలన్నారు. దేశ రాజకీయాలలో యువత పాత్ర చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే అబ్దుల్లా, లోకేష్, నాగరాజు, తిప్పేస్వామి, రాజు, ఈశ్వరరెడ్డి, మల్లిఖార్జున్ రైతులు తదితరులు పాల్గొన్నారు.




**నిజామాబాద్‌లో మహిళాదినోత్సవం**



### సియాటెల్‌లో మహిళా దినోత్సవం

మహిళా దినోత్సవం రోజున మైక్రోసాఫ్ట్ మెయిన్ ఆఫీసు సియాటెల్‌లో మహిళలు సమానత్వాన్ని సాధించాలంటే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఎక్కువ మంది మహిళలు రావాలని అన్నారు.

మార్చి 10వ తేదీన సమామిష్ లైబ్రరీ, సియాటెల్‌లో పీపుల్ ఫర్ లోక్‌సత్తా సదస్సు జరిగింది. ఈ సమావేశంలో ప్రింటర్‌ని ప్రారంభోత్సవం చేశారు. పీపుల్ ఫర్ లోక్‌సత్తా సమావేశంలో లోక్‌సత్తా పార్టీ ఆవశ్యకతను మహిళా సాధికారత గురించి యస్. మనోరమ గారు మాట్లాడారు. ఈ సమావేశంలో వివేక్, కిరణ్, రవి, సంతోషి, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా వార్తలు - సూచనలు

**పట్టణాలు, మండలాల నుండి లోక్‌సత్తా టైమ్స్‌కు వార్తలు పంపేవారు ఈ క్రింది సూచనలు పాటించండి.**

1. పార్టీ, అనుబంధ ప్రజాసంఘాలు నిర్వహించిన ప్రజా కార్యక్రమాలను మాత్రమే పంపించండి. పేపర్ కటింగ్స్ పంపేవారు ఒకటి లేదా రెండు కటింగ్స్ మాత్రమే పంపండి.
2. పత్రికాప్రకటనలు, పత్రికాగోష్ఠుల వార్తల్ని ప్రచురించడం సాధ్యపడదు.
3. ప్రత్యేక సమస్యలు ఉంటే వాటి మీద వార్తా కథనాలు పంపండి.


















మహబూబ్‌నగర్ ఉపఎన్నికల ప్రచారంలో డా॥ జయప్రకాష్ నారాయణ్

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12



ఉపఎన్నికల ప్రచారంలో డా॥ జయప్రకాష్ నారాయణ్

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad